₹ 10/-

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 9  పక్షపత్రిక  సంచిక - 22


నవంబరు 16-30, 2018








## జెండా కాదు... 6 అంశాల ఎజెండాతో తెలంగాణ ప్రజల ముందుకు లోక్‌సత్తా











హైదరాబాద్‌లో ప్రభుత్వ దంత వైద్యకళాశాల స్నాతకోత్సవంలో పాల్గొన్న
లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

నవంబర్ 16-30, 2018 సంపుటి - 9 సంచిక - 22

## కార్టూన్ కార్నర్




మాకు ప్రత్యేకంగా మ్యానిఫెస్టో లేదు సార్, అన్ని పార్టీల వాగ్దానాలనూ మేం తీరుస్తాం అంతే!

## లోపలి పేజీల్లో...

రుణమాఫీ వల్ల రైతుకు మేలు జరగలేదని............ 6
మేనిఫెస్టోల ద్వారా ఎన్నికల అవినీతి................ 8
సొమ్ము ప్రజలది - సోకు పార్టీలది!.................. 10
ఎటు చూస్తే అటు స్వర్గం!.............................. 13
చట్టబద్ధ పాలన మన ప్రాథమిక హక్కు............. 16
మహిళలపై వివక్ష ........................................ 18
వ్యవసాయంలో రాబడి తెచ్చే విధానాలు........... 20
ఉపప్రణాళిక ప్రచార ప్రణాళికే!........................ 22
ఆధ్వాన్న ప్రజారవాణాతో................................23
రాజ్యాంగ వ్యవస్థలను రక్షించుకుందాం............. 24
జేపీ దృష్టికి పలు సమస్యలు............................28
చెరుకు రైతు బకాయిలు చెల్లించండి!............... 29
చనిపోయాక రూ. 2 లక్షలివ్వటం కాదు....... 30
(మీడియాలో) 'కీ' కామెంట్లు......................... 31
అవినీతిపై యువత తెలివిగా పోరాడాలి........... 33

### సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311816**

విడి ప్రతి : రు. 10 ,
ఏడాది చందా : రు. 200
మూడేళ్ళ చందా : రు. 500

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836, **SBI** పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

IFSC No: SBIN0020072

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

# ఎజెండా కాదు..
# 6 అంశాల ఎజెండాతో తెలంగాణ ప్రజల ముందుకు లోక్‌సత్తా



తెలుగు రాష్ట్రాలతోపాటు యావత్ దేశంలో కంచెలే చేను మేసే ధోరణి పెరిగిపోతోందని మనలో చాలామంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీబీఐలో కాట్లాట కావచ్చు, పంజాబ్‌లో దసరా వేడుకలో రైలు కింద పడి పదుల సంఖ్యలో అమాయకులు మరణించటం కావచ్చు, ఏపీలో వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్‌పై దాడి విషయంలో వ్యవహారశైలి, తెలంగాణలో ఓటుకు నోటు కేసుపై నిద్రపోయి తిరగదోడేందుకు ఎన్నికల సమయంలో దాడులు చేయటం, మీటూ ఉద్యమం.. ఇవన్నీ మన కంచెలు ఎంత బలహీనమైనవో తెలియజెప్పే తాజా ఉదాహరణలు. కాస్త వెనక్కువెళ్తే ఈ జాబితాకి ఎన్నయినా చేర్చుకోవచ్చు. రాష్ట్ర విభజన జరిగాక తెలుగు రాష్ట్రాల్లో సాక్షాత్తూ ముఖ్యమంత్రులే అవినీతి అధికారులపై కేసుల విచారణ జరగకుండా ఫైళ్లను తొక్కిపట్టారు. సీబీఐలో ఇటీవలి పరిణామాల తర్వాత, ఎంతో నిజాయతీపరుడని మనం భావించే ప్రధాని నరేంద్రమోదీయే చేతులు కాల్చుకున్నట్టు స్పష్టంగా కనిపించాక.. కంచెల అరాచకత్వం పట్ల మనలో ఆందోళన పెరిగింది. ఏ నాయకుడిని నమ్ముకున్నా ఇంతేనన్న నిరాశ కూడా వ్యక్తమవుతోంది. కానీ ప్రతిస్పందనల్ని దాటి కొంచెం లోతుగా చూస్తేగానీ వాస్తవాలు అర్థం కావు.

అసలు స్వతంత్రం వచ్చాక ఇప్పటిదాకా మనం చట్టబద్ధపాలనకు సరైన ఏర్పాట్లు చేసుకున్నామా? చట్టం అందరికీ సమానమే, ఎవరు అధికారంలో ఉన్నా మనకు పోలీసులు రక్షణ కల్పిస్తారు, న్యాయం సక్రమంగా అందుతుంది.. అనే పరిస్థితి ఉండటానికి కావలసిన వ్యవస్థల్ని నిర్మించుకున్నామా?.. ఈ ప్రశ్నల్ని మొదట వేసుకోవాలి. చట్టబద్ధపాలనకు తగిన ఏర్పాట్లేమీ చేసుకోకుండానే లబోదిబోమంటున్నాం, నిరాశ పడుతున్నాం. 'చట్టం ఎవరికీ చుట్టం కాదు, తప్పు చేస్తే ఎవరికైనా శిక్ష పడుతుందనే వ్యవస్థను' జవహర్‌లాల్ నెహ్రూ కాలం నుంచి నేటి ప్రధాని నరేంద్ర మోదీ వరకూ ఎవరూ నెలకొల్పలేదు. టంగుటూరి ప్రకాశం పంతులు, నీలం సంజీవరెడ్డిల కాలం నుంచి చంద్రబాబు నాయుడు, కె.చంద్రశేఖరరావు వరకూ తెలుగునాట ఎవరూ నిర్మించలేదు. ఆ వైఫల్యం ఫలితాల్నే ఇప్పుడు సీబీఐలో కాట్లాట, పోలీసు అణచివేత, మహిళలపై లైంగికహింస వంటి రూపాల్లో అనుభవిస్తున్నాం. చట్ట నిబంధనల్ని పాటించటమంటే.. చేతిగానితనం అనుకుంటుంటాం. చట్టాలు సరిగా పనిచేయక ఎంతమంది కన్నీరు కారుస్తున్నా, పిట్టల్లా రాలిపోతున్నా పట్టించుకునే ప్రజాస్వామిక సున్నితత్వాన్ని పెంపొందించుకోలేకపోతున్నాం. తమ మీద లైంగిక దాడులను గుడ్ల నీరు కుక్కుకుని ఏళ్ల తరబడి భరించటానికి.. చట్టబద్ధ పాలనని మీడియాపరంగా పెద్దగా పట్టించుకోకపోవటం కూడా ఒక కారణమని ఈవేళ మీటూ ఉద్యమం ద్వారా బైటికొస్తున్న మహిళా జర్నలిస్టులు సైతం గుర్తించాలి.

ఈ మౌలిక లోపాల్ని దిద్దుకోకుండా.. మన పోలీసులు సరిగా పనిచేయరు, ఏసీబీ, సీబీఐలు సక్రమంగా లేవు, ఎన్నికల సంఘం అధికారులు ఎవరి మాటో వింటున్నారు, కోర్టుల్లో తీర్పులు అనుమానాస్పదంగా వస్తున్నాయి కాబట్టి అన్నీ వృథా అని ఎలా తేల్చిపారేయగలం? మన వ్యవస్థలు సరిగా లేవు కాబట్టి అమెరికా వారినో, చైనా వారినో సాయం అడుగుతామా?.. సంస్థల్లోని మంచిని కొనసాగిస్తూ వ్యవస్థల్ని సరైన పునాదులతో నిర్మించుకోవటం మాత్రమే పరిష్కారం! ఇది పూర్తిగా ఆచరణ సాధ్యం కూడా. సీబీఐ చుట్టూనే రాష్ట్రాల్లో కూడా మార్పుల్ని తీసుకురావచ్చు.

లోక్‌పాల్ చట్ట రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన లోక్‌సత్తా.. సీబీఐని లోక్‌పాల్ పరిధిలోకి తేవాలని సూచించింది. ఆ పరిధిలో తేవటం మాట అలావుంచి కేంద్ర ప్రభుత్వం అసలు లోక్‌పాల్ నియామకాన్నే చేయలేదు. ఈ పరిస్థితుల్లో సీబీఐకి స్వతంత్ర ప్రతిపత్తినివ్వటంతోపాటు జవాబుదారీ చేసేందుకు న్యాయకోవిదులతో సహా ఒక అత్యున్నత స్థాయి సంస్థను ఏర్పాటు చేయటం, ఆ సంస్థపై నిఘాకు మరో సంస్థను ఏర్పాటు చేయటం, డైరెక్టర్లుగా కేవలం పోలీసు ఉన్నతాధికారులే కాకుండా, న్యాయకోవిదులు, న్యాయమూర్తులు కూడా సారథ్యం వహించేలా చేయటం, మొత్తం కేసుల్ని బైటికి తీసి క్రమపద్ధతిలో విచారణ చేపట్టటం, సంస్థను దశలవారీగా విస్తరించటం (సీబీఐలో ఇప్పుడున్న సిబ్బంది కేవలం 8,000 మంది. వీరిలో కేసుల దర్యాప్తు చేసేవారు కేవలం 3,000 మంది. సీబీఐ సామర్థ్యాన్ని రాబోయే పదేళ్లలో 60,000కు పెంచాలి) వంటి మార్పుల్ని తేవటంతోపాటు.. మరీ ముఖ్యంగా రాష్ట్రాల్లోని పోలీసు వ్యవస్థను సంస్కరించాలి. ఎందుకంటే, చట్టబద్ధపాలన ప్రధానంగా రాష్ట్రాల పరిధిలోని అంశం.

రాష్ట్రాల్లో నేరపరిశోధన, ప్రాసిక్యూషన్ నిజంగా చట్టబద్ధపాలనలో 99 శాతం భారాన్ని మోస్తున్నాయి. సీ.బీ.ఐ పాత్ర దేశంలో కేవలం 1శాతం మాత్రమే - కేంద్ర ప్రభుత్వోద్యోగుల అవినీతి, రాష్ట్రాలు కావాలని అప్పగించిన క్రిమినల్ కేసులో మాత్రమే సీ.బీ.ఐ పరిధిలోకి వస్తాయి. రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులు వారంతటవారు ఈ మార్పుల్ని తీసుకువచ్చేంత నాయకత్వ పాటవాన్ని ప్రదర్శిస్తే, మనం హాయిగా ఇంటికెళ్లి నచ్చినపని చేసుకునేవాళ్లం. మనలో ఆసక్తి ఉన్నవారు మాత్రమే రాజకీయం, పాలనలో నచ్చినంత కాలం పనిచేయటానికి ముందుకొస్తే సరిపోయేది! కానీ అధికారాన్ని జనం మీద ప్రత్యక్షంగా ప్రదర్శించటానికి ఉపకరణంగా ఉండే పోలీసు వ్యవస్థ మీద పెత్తనాన్ని వదులుకోవటానికి ఈ పాలకులు అంగీకరించే అవకాశాలు చాలా తక్కువ. నచ్చనివాళ్లను బెదిరించటం, జైళ్లలో తోయటం, తుపాకితో కాల్చటం ద్వారా అధికారాన్ని ప్రదర్శించటం (పెత్తనం చేయటం) తేలికని వారికి బాగా తెలుసు. అందుకే మార్పు ప్రయత్నం మన వైపు నుంచే మొదలవ్వాలి. అందుకు ఎన్నికలు ఒక గొప్ప అవకాశం. తెలంగాణలో చట్టబద్ధపాలనకు నిర్దిష్టమైన హామీ ఇచ్చే పార్టీకే, అభ్యర్థికే ఓటు వేస్తామని మనం గట్టిగా పట్టుబట్టాలి. త్వరలో

ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇదేతరహా అవకాశం వస్తుంది. ఈ అవకాశాల్ని సద్వినియోగం చేసుకోవాలి. చట్టబద్ధపాలనలో అనేక కోణాలున్నాయి. వాటిలో తక్షణం ఆచరణసాధ్యమైన అంశాలను ప్రస్తుతానికి ఎంచుకుందాం. మహిళల భద్రతకు, మనకు తక్షణ న్యాయానికి 'స్థానిక కోర్టుల' ఏర్పాటు, నేరపరిశోధనలో రాజకీయ జోక్యం లేకుండా చేయటం అనే డిమాండ్లకు పరిమితమవుదాం.

చట్టబద్ధపాలన అంశం తరహాలోనే హైదరాబాద్ నుంచి గ్రామ పంచాయతీల వరకూ తెలంగాణలోని ఇతర ప్రధాన సమస్యల్నీ లోక్‌సత్తా లోతుగా విశ్లేషించి వాటిని కొన్ని విభాగాలుగా చేసింది. వీటికి పెద్ద ఖర్చు లేకుండా వెంటనే అమలు చేయగల, కులం, మతంతో సంబంధం లేకుండా ప్రజలందరికీ పెద్దఎత్తున మేలు చేయగల ఆరు నిర్దిష్ట పరిష్కారాలను రూపొందించింది. ఎన్నికల్లో పోటీతో సంబంధం లేకుండా, ఈ 6 అంశాల ఎజెండాను సమాజం, పార్టీలు, అభ్యర్థుల్లోకి తీసుకెళ్లి చర్చకు పెట్టి వీటి అమలుకు ఒప్పుకునేవారికే ప్రజలు ఓటు వేసేలా చేయాలన్నది లోక్‌సత్తా ప్రయత్నం. అంటే, లోక్‌సత్తా ఈసారి జెండాతో కాకుండా ఎజెండాతో తెలంగాణ అసెంబ్లీ ముందస్తు ఎన్నికల బరిలోకి దిగుతోంది. లోక్‌సత్తాకు కనీసం 10-15 శాతం ఓట్ల బలం అన్నిచోట్లా నిలకడగా వస్తూ ఉంటే, ఎజెండాతోపాటు నేరుగా లోక్‌సత్తా అభ్యర్థులే ఎన్నికల్లో నిలబడి ఉండేవారు. ఆ పరిస్థితి ఈ ఎన్నికల్లో కూడా కనిపించటం లేదు. అయితే, ఈలోగా మార్పు ఆలస్యం కాకూడదు. అందుకే సరైన ఎన్నికల ఎజెండాను స్పష్టంగా నిర్దేశించేలా కార్యక్రమాన్ని రూపొందించుకుని ప్రత్యక్షంగానూ, సోషల్ మీడియా ద్వారానూ జనంలోకి వస్తోంది. ఒకవేళ అన్ని పార్టీలూ ఈ ఎజెండాకు ఆమోదిస్తే, మొత్తం ఎన్నికల ఎజెండానే మనం ప్రభావితం చేసినవాళ్ల మవుతాం. సరైన ఎజెండా, ఎన్నికయ్యాక దాన్ని సక్రమంగా అమలు చేయటం కంటే ఎన్నికల ద్వారా వచ్చే గొప్ప ప్రయోజనం ఇంకేముంటుంది! ఒకరికి మించి ఈ ఎజెండాకు హామీ ఇచ్చే వారుంటే.. వారిలో మీకు నచ్చినవారికి ఓటు వేసుకోవచ్చు. గెలిచాక అభ్యర్థులు, పార్టీలు మాట తప్పకుండా కూడా మనం ముందు జాగ్రత్తలు తీసుకుందాం. వారి చేత రాయించుకోవటమో, వారి హామీల్ని ఇతర సాక్ష్యాల ద్వారా రికార్డు చేయటమో చేసి, మాట తప్పితే మళ్లీ జనంలోకి తీసుకొచ్చే బాధ్యతను కూడా లోక్‌సత్తా తీసుకుంటుంది.

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో లోక్‌సత్తా ప్రతిపాదిస్తున్న 6 అంశాల ఎజెండా:

**1) ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా పౌర సేవలు:** ప్రభుత్వ ఆఫీసుల్లో లంచాలు, వేధింపులు, దేబిరింపులు, ఆలస్యాలు లేకుండా ప్రజలకు నిర్ణీత గడువులోగా హక్కుగా సేవలు అందించేందుకు 'పౌర సేవల' చట్టం తేవటం

**2) ఖర్చు లేకుండా నాణ్యమైన పాఠశాల విద్య:** పుట్టిన ప్రతి బిడ్డకీ ఖర్చు లేకుండా అత్యున్నత ప్రమాణాల పాఠశాల విద్యను అందించి పౌరులందరికీ ఎదిగే అవకాశం ఇవ్వటం

**3) భారం లేకుండా అందరికీ ఆరోగ్యం:** ప్రతి వ్యక్తికీ అత్యున్నత ప్రమాణాల ఆరోగ్యాన్ని 'ప్రాథమిక స్థాయి నుంచి' ఆధునిక ఆస్పత్రుల దాకా ఆ కుటుంబంపై ఏమాత్రం భారం లేకుండా అందించటం


**4) స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాలు:** కేంద్రం నుంచి రాష్ట్రానికి వనరులు పంపిణీ అవుతున్న రీతిన రాష్ట్ర బడ్జెట్ నుంచి స్థానిక ప్రభుత్వాలకి, ముఖ్యంగా చిన్న పట్టణాలకి 50శాతం వనరులు పంపిణీ అయ్యేట్టు చేయటం, ఎక్కడికక్కడ ప్రజల అవసరాల్ని వారి భాగస్వామ్యంతో (ఎన్నికైన వార్డు కమిటీలు వంటి రూపాల్లో) తీర్చే పాలనా ఏర్పాట్లు చేయటం

**5) చట్టబద్ధ పాలన - మహిళల రక్షణ:** పెరుగుతున్న నగరీకరణతో సామాన్య ప్రజల హక్కుల్ని కాపాడటం కోసం, మహిళలకు రోజువారీ జీవితంలో భద్రతను అందించటం కోసం, నేరానికి శిక్ష పడి న్యాయం అందుతుందన్న విశ్వాసం కల్పించటం కోసం 'స్థానిక న్యాయాలయాల'ను అన్ని చోట్లా ఏర్పాటు చేయటం, నేర దర్యాప్తులో రాజకీయ జోక్యం లేకుండా చేయటం

**6) పంటల ధరల సంక్షోభం నుంచి లాభసాటి వ్యవసాయానికి:** రైతుల పంట ఉత్పత్తులకు మంచి ధర అందించటం చుట్టూ వ్యవసాయ విధానాల్ని రూపొందించటం, వ్యవసాయాన్ని- చిన్న పట్టణాల్ని అనుసంధానించి స్థానికంగా ఉపాధితో గ్రామీణ, వ్యవసాయ రంగాల్లో పెరుగుతున్న సంక్షోభాన్ని నివారించటం

.. ఈ ఆరు అంశాలూ సురాజ్య తెలంగాణను ఆవిష్కరించేవి. తెలంగాణ ఉద్యమ లక్ష్యాల్ని నెరవేరుస్తూ ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలనిచ్చేవి, నివారించదగ్గ అనేక బాధలను తొలగించేవి. వీటికి అదనంగా ఇంకా కొన్ని అంశాలేమైనా ఉంటే స్థానికంగా జోడించుకోండి. కానీ ఈ ఆరూ మాత్రం కచ్చితంగా మన ఎన్నికల డిమాండ్లలో ఉండేలా చూసుకుందాం. వివిధ ప్రధాన పార్టీలు ప్రకటించిన మ్యానిఫెస్టోల్లో ఉచితాలు, తాత్కాలిక తాయిలాల హామీలపై పోటీ, యథాతథస్థితిని కొనసాగించే మొక్కుబడి కార్యక్రమాలు తప్ప.. నిజంగా పేదరికాన్ని పారదోలి ప్రజలకు ఎదిగే అవకాశాలనిచ్చే అంశాలు దాదాపు లేవు. వేలకోట్లతో రైతు రుణమాఫీ చేసి ఆ పార్టీలు రైతులను ఎంత ఉద్ధరించాయో చూశాంగా! మనిషి తన మాంసాన్ని తానే తినే రీతి తాయిలాల్ని పార్టీలు పోటాపోటీగా ప్రకటించాయి. జెండాలు, రంగులు తీసేస్తే అన్ని పార్టీల మేనిఫెస్టోలూ ఒకేలా, తాయిలాలతో అధికారమే పరమావధి అన్నట్టుగా ఉన్నాయి. ఒకట్రెండు పార్టీలు లోక్‌సత్తా ప్రతిపాదించిన పౌర సేవల చట్టం గురించి మాట్లాడాయి. సంతోషం. ఇప్పటికే మ్యానిఫెస్టోలను ప్రకటించినా కూడా ఈ 6 అంశాల ఎజెండా కోసం మనం పట్టుబట్టి పార్టీలు, అభ్యర్థుల నుంచి హామీ తీసుకోవాలి. వీటి అమలు విధానాల గురించి కూడా కొంత స్పష్టత అడుగుదాం. సురాజ్య తెలంగాణను ఆవిష్కరించే ఈ ఆరు అంశాలనూ ఎన్నికల ఎజెండాగా మార్చే లక్ష్యసాధనలో లోక్‌సత్తా ఉద్యమం, పార్టీ సభ్యులు, నాయకులు, అభిమానులు, కొత్తగా సభ్యులైన యువతీయువకులు, సమాజహితం కోరేవారు అందరూ క్రియాశీల భాగస్వాములై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

# రుణమాఫీ వల్ల రైతుకు మేలు జరగలేదని వాస్తవాలు హెచ్చరిస్తున్నా.. మళ్లీ అదే ఎన్నికల హామీ!




రుణమాఫీ చేయటం వల్ల రైతులకు లాభం లేకపోగా తక్కువ వడ్డీకి అప్పులు పుట్టటంకూడా తగ్గిపోతుందని.. అదే డబ్బుని రైతు పండించిన పంటకు ఎక్కువ ధర రావటానికి వీలుగా ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు కోసం, మౌలిక వసతుల కల్పన, రైతు కుటుంబాలకవెదుగుదలకు అవసరమైన నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందించటం కోసం వినియోగించాలని 2008లో యూపీయే ప్రభుత్వం దేశవ్యాప్త వ్యవసాయ రుణమాఫీని ప్రకటించినప్పుడు లోక్‌సత్తా సూచించింది. ఆ తర్వాత 2014 ఎన్నికల్లో తెలుగు రాష్ట్రాల్లో తెరాస, కాంగ్రెస్, తెదేపా రుణమాఫీ హామీనిచ్చినప్పుడూ అదే మాట చెప్పింది. గత కొన్నేళ్లుగా ప్రభుత్వాలు అమలు చేస్తున్న రుణమాఫీ వల్ల రైతులకు పెద్ద ప్రయోజనమేమీ చేకూరలేదని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఇటీవల విడుదల చేసిన నివేదిక కూడా వెల్లడించింది. రుణమాఫీ ఎంత అసంబద్ధమైనదో క్షేత్రస్థాయి వాస్తవాలు, హేతుబద్ధ విశ్లేషణలు స్పష్టంగా హెచ్చరిస్తున్నా .. తెలంగాణలో ఈసారి ఎన్నికల్లో కూడా మళ్లీ రైతు రుణమాఫీని ప్రధాన పార్టీలు పోటీపోటాగా ప్రకటించాయి.

### ఆర్‌బీఐ నివేదికలోని అంశాలు

2008లో కేంద్ర ప్రభుత్వం, ఆ తర్వాత రాష్ట్రాలు అమలు చేస్తూ వస్తున్న రుణమాఫీలను చూస్తే రైతు కుటుంబాల రుణభారం తగ్గినప్పటికీ పెట్టుబడులు, కుటుంబాల ఆదాయం పెరిగిందనడానికి ఎలాంటి ఆధారాలు లేవని ఆర్‌బీఐ తెలిపింది.

"2014 నుంచి వివిధ రాష్ట్రాలు ప్రకటిస్తూ వస్తున్న రైతు రుణమాఫీ కారణంగా ప్రభుత్వాలపై ఒత్తిడి పెరుగుతోంది. వరుస కరువులతోపాటు గిట్టుబాటు ధరలు లేకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారన్న కారణంగా రుణమాఫీ ప్రకటిస్తున్నట్లు ప్రభుత్వాలు చెబుతున్నాయి. ఈ మాఫీ ప్రభావం ఒక్కో రాష్ట్రంపై ఒక్కో విధంగా ఉంది. ఉత్తరప్రదేశ్ చేసిన రుణమాఫీ దాని స్థూల ఆర్థిక లోటులో దాదాపు 60.9 శాతానికి సమానం.

వివిధ రాష్ట్రాలు చేసిన రుణమాఫీలు అవి 'ప్రకటించినదానికంటే తక్కువగా' ఉన్నాయి. పూర్తిస్థాయిలో అమలుచేస్తే ఆర్థిక పరిస్థితులు మరింత కుంచించుకుపోవడం ఖాయం. ఈ పథకాల కారణంగా 2017-18లో వివిధ రాష్ట్రాల మూలధన వ్యయం తగ్గిపోయింది. ప్రభుత్వాలు అభివృద్ధి కార్యక్రమాలపై చేసే ఖర్చు తగ్గిపోయింది. ఈ పథకాలు రాష్ట్ర ప్రభుత్వాలను దారితప్పేలా చేస్తున్నాయి. ఉదయ్ వంటి కార్యక్రమాలను అమలు చేయలేని పరిస్థితిని కల్పిస్తున్నాయి. రుణమాఫీలాంటి ఆర్థిక ప్రోత్సాహకాల కారణంగా వ్యవసాయ ఉత్పాదకత పెరిగిందనడానికి ఎలాంటి ఆధారాలూ లేవు. పైగా దీనివల్ల పెరిగే ఆర్థికలోటు జీడీపీ వృద్ధికి ప్రతిబంధకంగా మారే అవకాశముంది. మాఫీలను సమర్థవంతంగా అమలుచేయకపోతే ఇది మరింత ద్రవ్యోల్బణానికి దారితీసి ఆర్థికలోటును ఆందోళనకర స్థితికి తీసుకెళ్లే ప్రమాదం ఉంది. రుణమాఫీల కారణంగా భవిష్యత్తులో బ్యాంకుల వంటి ఆర్థిక సంస్థలు రైతులకు రుణాలు ఇవ్వడానికి సుముఖత చూపించకపోవచ్చు. ఫలితంగా గ్రామీణ రుణ వ్యవస్థ దారుణంగా దెబ్బతినే ప్రమాదం ఉంది. రైతులు విధి లేని పరిస్థితుల్లో వడ్డీవ్యాపారుల వైపు మళ్లటం పెరుగుతుంది. రుణమాఫీల వల్ల అసలైన రైతుల కంటే ఇతరులే ఎక్కువగా లబ్ధి పొందారు. రుణమాఫీ ప్రభుత్వ బ్యాలెన్స్‌షీట్లకు హానికారకం. ప్రభుత్వ విధానాల అమలుపై అంతులేని ప్రభావం చూపుతుంది" అని రాష్ట్రాల ఆర్థిక స్థితిగతులపై విడుదల చేసిన నివేదికలో ఆర్‌బీఐ పేర్కొంది.

### ఈసారి రుణమాఫీకి రూ.22,000 నుంచి 35,000 కోట్ల దాకా

2018 ముందస్తు అసెంబ్లీ ఎన్నికల్లో గెలిస్తే రూ.1లక్ష రుణమాఫీని రైతులకు ఇబ్బంది లేకుండా చేస్తామని తెరాస అధినేత, రాష్ట్ర (ఆపద్ధర్మ) ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు హామీ ఇచ్చారు. ప్రధాన పోటీదారుగా ఉన్న కాంగ్రెస్ నేతృత్వంలోని మహాకూటమి రూ.2 లక్షల రుణమాఫీని ఒకే విడతలో చేస్తామని ప్రకటించింది. తామేమీ తక్కువ తినలేదన్నట్టు.. బీజేపీ కూడా ఇదే హామీని ప్రకటించింది.

| రాష్ట్రాల రుణమాఫీ వివరాలు | | | |
|---|---|---|---|
| రాష్ట్రం | సంవత్సరం | రుణమాఫీ (రూ.కోట్లలో సుమారు) | జీఎస్‌డీపీలో రుణమాఫీ శాతం |
| ఆంధ్రప్రదేశ్ | 2014 | 24 వేలు | 4.6 |
| తెలంగాణ | 2014 | 17 వేలు | 3.4 |
| తమిళనాడు | 2016 | 6 వేలు | 0.5 |
| మహారాష్ట్ర | 2017 | 34 వేలు | 1.3 |
| ఉత్తరప్రదేశ్ | 2017 | 36 వేలు | 2.7 |
| పంజాబ్ | 2017 | 10 వేలు | 2.1 |
| రాజస్తాన్ | 2018 | 8 వేలు | 0.9 |
| కర్ణాటక | 2018 | 34 వేలు | 2.4 |




ఈ హామీలపై ప్రాథమిక అంచనా వేయగా.. తెరాస హామీ ప్రకారం రూ. లక్ష రుణమాఫీ ఒకేసారి చేయాలంటే వచ్చే జూన్ కల్లా రూ.22,000 కోట్లను బ్యాంకులకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంటుంది, కూటమి చెబుతున్న విధంగా రూ.2 లక్షల రుణమాఫీని ఒకేవిడతలో చేయాలంటే రూ.35,000 కోట్ల వరకు బ్యాంకులకు విడుదల చేయాలి.

తెలంగాణలో సుమారు 40 లక్షల మంది రైతులకు మాఫీ చేయాల్సి ఉంటుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు 2014లో రూ. లక్ష రుణమాఫీ 35.30 లక్షల మందికి చేశారు. అప్పుడు మొత్తం రూ.16,120 కోట్లను బ్యాంకులకు 4 దఫాలుగా రాష్ట్ర ప్రభుత్వం అందజేసింది. అప్పటికి, ఇప్పటికి పంట రుణ పరిమితి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్) పెరగటంతోపాటు, కొత్తగా పెద్దసంఖ్యలో రైతులు రుణాలు తీసుకుంటున్నారు. దీనివల్ల ఇప్పుడు రూ. లక్ష వరకు రుణమాఫీ చేయాలన్నా రూ.22,000 కోట్ల దాకా ఇవ్వాలి. తెలంగాణలో తెరాస, మహాకూటమి కూడా రుణమాఫీ హామీ ఇవ్వటంతో.. గతంలో పంటరుణం ఏటా తీసుకోనివారు భూముల యజమానులు కూడా బ్యాంకులకు వచ్చి రుణాలు తీసుకుంటున్నారు. జాతీయస్థాయిలో వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో గెలిస్తే, దేశవ్యాప్తంగా వ్యవసాయ రుణాల మాఫీని అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ చెప్పటం కూడా ఈ ధోరణులకు ఊతమిస్తోంది. వ్యవసాయాన్ని వదిలేసి పట్టణాలు, నగరాల్లో నివాసం ఉంటున్నవారు సైతం తమ పేరిట ఉన్న భూములపై పంటరుణాలు తీసుకుంటున్నారని, ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా మాఫీ అవుతుందిలే అన్న ధీమా వీరిలో కనిపిస్తోందని బ్యాంకు ప్రధానాధికారొకరు ఒక మీడియాసంస్థతో మాట్లాడుతూ తెలిపారు. పైగా రుణమాఫీ చేస్తామని అన్ని పార్టీలూ హామీ ఇస్తున్నందున గతంలో పంటరుణాలు తీసుకున్న రైతులు తిరిగి చెల్లించడం చాలా వరకు తగ్గించారని, దీనివల్ల వారికి ప్రస్తుత యాసంగిలో కొత్త రుణాల పంపిణీ కూడా పెద్దగా ఉండటం లేదని వివరించారు. ఎన్నికలు డిసెంబర్‌లో జరుగుతున్నందున ఈ ఏడాది ఆగస్టు లేదా సెప్టెంబర్ వరకు బ్యాంకు రుణాలు తీసుకున్న రైతులందరికీ మాఫీ వర్తించేలా నిబంధన పెట్టే అవకాశాలున్నాయని ఆయన తెలిపారు.

## రైతుబంధుకు మరో రూ.13,000 కోట్లు

రైతుబంధు పథకం కింద ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఎకరానికి రూ.8 వేలను ఇస్తున్నారు. వీటిని వానాకాలం (ఖరీఫ్)లో రూ.4,000, యాసంగి (రబీ)లో మరో రూ.4,000గా రైతుకి అందజేస్తున్నారు. ఈ ఏడాది పథకానికి రూ.10,500 కోట్ల వరకూ కేటాయించారు. ఎన్నికల్లో గెలిస్తే ఈ సొమ్మును ఏడాదికి రూ.10,000కు పెంచుతామని తెరాస, మహాకూటమి ప్రకటించాయి. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది ఇందుకు దాదాపు రూ.13,000 కోట్ల దాకా అవసర మవుతాయని అంచనా. ✧


# మేనిఫెస్టోల ద్వారా ఎన్నికల అవినీతి

- డి.వి.వి.ఎస్ వర్మ

***రాజకీయ పార్టీలు తమ విధానాలకు తగిన వాగ్దానాలు చేసుకునే స్వేచ్ఛను కోరడం తప్పు కాదు. ఐతే వారు మేనిఫెస్టోలు అమలు చేసే జవాబుదారీతనాన్ని ఆమోదించాలి. జవాబుదారీతనంలేని మేనిఫెస్టోలకు అడ్డుకట్ట వెయ్యడానికి వారు సిద్ధం కావాలి. చాలా దేశాలలో పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోతోపాటు తమ పార్టీ ద్రవ్య ప్రణాళికను విధిగా జత పరుస్తున్నాయి. తాము చేసిన వాగ్దానాలకు అయ్యే అదనపు ఖర్చు వివరాలు, ఈ నిధులను ఎలా సేకరిస్తారు, ఎక్కడ పన్నులు పెంచుతారు, ఎక్కడ కోతలు పెడతారు అన్న వివరాలన్నీ తమ ద్రవ్య ప్రణాళికలో నిర్దిష్టంగా వివరిస్తారు. దీనికి తోడు వాగ్దానాలను నెరవేర్చలేక చేతులెత్తేసినప్పుడు అధికారం నుండి వైదొలగడానికి సిద్ధపడాలి.***

తెలంగాణలో ఎన్నికల ప్రచారం జోరందుకుంది. సరికొత్త వాగ్దానాలతో పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోల వంటకాలకు కమిటీల మీద కమిటీలు కసరత్తులు చేశాయి (మరోవక్క ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలు కనుచూపు మేరలో ఉన్నందున అక్కడా వివిధ పార్టీల నాయకులు ప్రచార పర్యటనలతో హోరెత్తిస్తున్నారు. ఇలాంటి ఆకర్షణీయ వాగ్దానాల వరద పారిస్తున్నారు). ఇవన్నీ రానున్న ఎన్నికలకు మేనిఫెస్టోలు కాబోతున్నాయి. ప్రభుత్వ డబ్బుతో ప్రలోభ ఉచితాలను ప్రకటించి ప్రజలను ప్రభావితం చేసి ఓట్లు దండుకోవడం రాజకీయ కళగా మారింది.

ఈ తరహా మేనిఫెస్టోల తీరుపై సుప్రీం కోర్టు తీవ్రంగా స్పందించింది. ప్రజాప్రాతినిధ్య చట్టంలో "ఎన్నికల్లో అవినీతి చర్యలు'' జాబితాలో లేకపోయినంత మాత్రాన ఇవి అవినీతి చర్యలు కాకుండా పోవని వ్యాఖ్యానించింది. పైగా ఇవి స్వేచ్ఛాయుతంగా, న్యాయబద్ధంగా జరగాల్సిన ప్రజాస్వామ్య




ఎన్నికల పునాదులకే విఘాతం కలిగిస్తాయని స్పష్టం చేసింది. దీనిపై చట్టం చెయ్యాలని ప్రభుత్వాన్ని ఆదేశించే వీలు లేనందున, దీనికిగల ప్రాధాన్యత రీత్యా ఎన్నికల కమిషన్ తక్షణమే గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సంప్రదించి పార్టీల ఎన్నికల మేనిఫెస్టోలకు మార్గ దర్శకాలను రూపొందించాలని ఆదేశించింది. ఎన్నికల సమయంలో పార్టీలు విధిగా పాటించాల్సిన "మోరల్ కోడ్ ఆఫ్ కాండక్ట్"లో భాగంగా వాటిని అమలు చెయ్యాలని కోరింది.

2013 జులైలో సుప్రీం కోర్టు తీర్పునిస్తే భారత ఎన్నికల కమిషన్ ఆగస్టులోనే ఈ అంశంపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల సమావేశాన్ని నిర్వహించింది. అన్ని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలపై ఎలాంటి ఆంక్షలూ ఉండకూడదని ప్రకటించాయి. దీనితో సుప్రీం కోర్టు తీర్పు, ఎన్నికల కమిషన్ ప్రయత్నాలు నిలిచిపోయాయి. మరోపక్క పార్టీల ఎన్నికల మేనిఫెస్టోలు మాత్రం రానురాను ప్రలోభ ఉచితాల పుట్టలుగా మారిపోతున్నాయి.

రాజకీయ పార్టీలు తమ విధానాలకు తగిన వాగ్దానాలు చేసుకునే స్వేచ్ఛను కోరడం తప్పు కాదు. ఐతే వారు మేనిఫెస్టోలు అమలు చేసే జవాబుదారీతనాన్ని ఆమోదించాలి. జవాబుదారీతనంలేని మేనిఫెస్టోలకు అడ్డుకట్ట వెయ్యడానికి వారు సిద్ధం కావాలి. చాలా దేశాలలో పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోతోపాటు తమ పార్టీ ద్రవ్య ప్రణాళికను విధిగా జత పరుస్తున్నాయి. తాము చేసిన వాగ్దానాలకు అయ్యే అదనపు ఖర్చు వివరాలు, ఈ నిధులను ఎలా సేకరిస్తారు, ఎక్కడ పన్నులు పెంచుతారు, ఎక్కడ కోతలు పెడతారు అన్న వివరాలన్నీ తమ ద్రవ్య ప్రణాళికలో నిర్దిష్టంగా వివరిస్తారు. దీనికి

తోడు వాగ్దానాలను నెరవేర్చలేక చేతులెత్తేసినప్పుడు అధికారం నుండి వైదొలగడానికి సిద్ధపడాలి.

ఈ అంశాలతో మేనిఫెస్టోల జవాబుదారీ చట్టం చెయ్యాలి. అప్పుడు వాగ్దానాలు చేసే హక్కు పార్టీలకు, అమలు జరిపించుకునే హక్కు ప్రజలకీ ఉంటుంది.

మరో కీలక అంశం ప్రలోభ ఉచితాలు. అవసరమైన ఉచితాలనీ, ప్రలోభ ఉచితాలనీ వేరు చేయడంలో కొంత సంక్లిష్టత ఉన్నా అది అసాధ్యం మాత్రం కాదు. ఇవి రెండూ శ్రేయోరాజ్యం గొడుగు కిందే వున్నందువల్ల, దానిని నిర్దిష్టంగా నిర్వచించుకుంటే మనకు దారి దొరుకుతుంది. శ్రేయో రాజ్యంలో.. మొదటిది జీవించే హక్కును గ్యారంటీ చేయడం. అంటే అర్హులైన అందరికీ ఆహారం పొందడానికి తగిన ఆదాయాన్ని, నివాస వసతిని కల్పించి తీరాలి.

రెండవది సంక్షేమం. అంటే ప్రజలకు శక్తి సామర్థ్యాలను, ఎదిగే అవకాశాలను పెంచడం. మంచి ప్రమాణాల విద్య, వైద్యం, నైపుణ్యాలను అందరికీ అందించడం.

మూడవది సామాజిక న్యాయం. అంటే వివక్ష తరగతుల సామాజిక హోదాను మార్చే చర్యలు తీసుకోవాలి. కనీస ఆదాయ భద్రత, విద్య, రాజకీయ రంగంలో అన్ని స్థాయిలలో భాగస్వామ్యం కల్పించాలి.

వీటన్నింటిలోనూ ఉచితాలుంటాయి. ఐతే అవి ప్రజల జీవనహక్కుకీ, శక్తి సామర్థ్యాలనూ ఎదిగే అవకాశాలనూ పెంచడానికి, వివక్ష తరగతుల సామాజిక హోదాను మార్చడానికి అవసరమైన ఉచితాలు. ఈ నిర్వచనాల పరిధిలోకి రాని వాటన్నింటినీ స్థూలంగా ప్రలోభ ఉచితాలుగా పరిగణించాలి. ప్రభుత్వ ధనంతో ఇచ్చే మిక్సీలు, గ్రైండర్లు, కలర్ టీవీలు, సెల్‌ఫోన్లు వగైరాలు, ప్రభుత్వాలే పెళ్లి ఖర్చులు భరించడం, సీమంతాలు జరిపించడం, పండుగలకు కానుకలు పంపించడం, 'అమ్మ' లేదా 'అన్న' క్యాంటీనులలో వండి వడ్డించడాలు, ఉచిత సిలిండర్లు... వగైరాలన్నీ ప్రలోభ ఉచితాలే. వీటినే సుప్రీంకోర్టు "ఎన్నికలలో అవినీతి"గా పరిగణించాలని సూచించింది.

ఇక్కడే మరో అంశాన్ని కూడా ప్రస్తావించడం అవసరం. శ్రేయోరాజ్య సంక్షేమం పొందాల్సినవారు వివిధ కులాలుగా చీలిపోయి వున్నా వారందరి సమస్యలు, పరిష్కారాల స్వరూపం ఒకటే. అందరికీ స్వతంత్ర జీవనం ఇచ్చే ఉమ్మడి పథకాల రచనకు బదులుగా ప్రభుత్వ ధనంతో కులాలవారీగా ప్రత్యేక పథకాలు, రాయితీలతో ప్రలోభపెట్టి ఆయా కులాలను ఓటు బ్యాంకులుగా మార్చుకోవడం కూడా ప్రలోభ ఉచితాల కోవకే చెందుతుంది.

సుప్రీం కోర్టు సూచించిన విధంగా ఈ ప్రలోభ ఉచితాలను ప్రజాప్రాతినిధ్య చట్టంలో "ఎన్నికలలో అవినీతి" చర్యల జాబితాలో చేర్చాలి. ప్రలోభ ఉచితాలు సమాజ అభివృద్ధి కోసం పుట్టుకొచ్చినవి కావు. ఇవి అడ్డదారిలో అధికారాన్ని పొందడానికి రాజకీయ పార్టీలు చేసిన విశ్వామిత్ర సృష్టి. ఇవి కొనసాగితే పేదరికం శాశ్వతం అవుతుంది. అందరికీ ఎదిగే అవకాశాలు త్రిశంకు స్వర్గంలో చిక్కుకుంటాయి. ✧

# పార్టీల హామీలపై దళితుల కంట్రోల్ రూమ్



ఎన్నికల్లో రాజకీయ పార్టీలు కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసుకోవటం పరిపాటి. కానీ తొలిసారిగా రాజస్తాన్‌లో దళితుల కోసం 24 గంటల కంట్రోల్‌రూమ్ ఏర్పాటైంది. రాజస్తాన్ 2018 అసెంబ్లీ ఎన్నికల కోసం దళిత సంఘాలన్నీ ఏకమై దీన్ని ఏర్పాటు చేసుకున్నాయి. ఎన్నికల ప్రచారంలో ఏయే పార్టీలు దళితుల గురించి ఎలాంటి హామీలిస్తున్నాయని గమనించడం, ఆయా హామీలపై అవసరమైనప్పుడు స్పందించడం, ఎన్నికల నేపథ్యంలో దళితులు, బడుగు బలహీన వర్గాలు ఇచ్చే ఫిర్యాదులపై అధికారులను అప్రమత్తం చేయడం వంటి పనులను ఈ కంట్రోల్ రూమ్ ద్వారా నిర్వర్తిస్తారు. ఎన్నికల సందర్భంగా దళితుల హక్కులకు ఎక్కడా భంగం వాటిల్లకుండా చూడటమే దీని ఏర్పాటు వెనుక ముఖ్యోద్దేశమని దళిత సంఘాల నాయకులు చెబుతున్నారు.


# సొమ్ము ప్రజలది – సోకు పార్టీలది!

- ఆర్కే

- ప్రజలు కష్టపడి కడుతున్న పన్నులను సంక్షేమం పేరిట పంచి పెట్టి, అధికారాన్ని కొనుక్కునే దుష్టసంస్కృతికి ఇప్పుడు తెరలేచింది. సంక్షేమం పేరిట పేరుకు పేరు, అధికారం కూడా దక్కుతున్నందున నాయకుల ఆలోచనలన్నీ ఆ దిశగానే సాగుతున్నాయి.
- నాయకులు మహానుభావులుగా పిలిపించుకోవడానికై ప్రజలను మహాయాచకులుగా మార్చడం వాంఛనీయమూ, సమర్థనీయమూ కానే కాదు!
- నిరుద్యోగులను తయారు చేస్తున్నవారే ఎన్నికల సమయంలో వారెక్కడ ఎదురుతిరుగుతారోనని నిరుద్యోగ భృతిని చెల్లిస్తామంటున్నారు. ఇంతకంటే దగాకోరుతనం ఉంటుందా?

తెలుగునాట రాజకీయ నాయకులకు చేతికి ఎముక లేకుండా పోతోంది. అపర దానకర్ణుల్లా భావించుకుంటూ ప్రజాధనాన్ని పప్పు బెల్లాల్లా పంచిపెట్టడానికి సమాయత్తం అవుతున్నారు. సంక్షేమం పేరిట బాధ్యతారహితమైన సమాజాన్ని సృష్టించడానికి నాయకులు పోటీ పడుతున్నారు. ఒకప్పుడు ఎన్నికలంటే విధానాల ప్రాతిపదికన జరిగేవి. అధికారంలోకి వస్తే ఏమి చేయబోతున్నదీ చెప్పేవారు. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. ప్రాంతీయ పార్టీలకు పోటీగా జాతీయ పార్టీలు కూడా జాతీయ విధానమంటూ లేకుండా 'ఏ రోటికాడ పాట ఆ రోటికాడ' అన్నట్టుగా ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా ఎన్నికల ప్రణాళికలను ప్రకటిస్తున్నాయి. 'నాది కాకపోతే కాశీ దాకా దేకమన్నారు' అన్నట్టుగా వరాల జల్లు పేరిట ప్రజాధనాన్ని పందేరం చేయడానికి అన్ని పార్టీలూ పోటీ పడుతున్నాయి.

ముందస్తు ఎన్నికల తెలంగాణ విషయానికి వద్దాం. అధికారంలోకి రాకపోతే ఆగమైపోతామన్న భయంతో ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగ భృతితోపాటు 2 లక్షల వరకు రైతులకు రుణమాఫీ చేస్తామని ప్రకటించింది. ఇవే కాకుండా రైతుబంధు, పింఛను మొత్తాలను పెంచడం వంటివి ఉండనే ఉన్నాయి. అధికారంలో ఉన్న తెలంగాణ రాష్ట్ర సమితి "ఇవేమి హామీలు? అమలు ఎలా సాధ్యం?" అంటూ విమర్శలు చేసింది. మంత్రి కేటీఆర్ ఇంకో అడుగు ముందుకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ ఇస్తున్న హామీలు అమలు కావాలంటే దక్షిణాది రాష్ట్రాల బడ్జెట్ కూడా సరిపోదని విమర్శించారు. "ఏ ప్రాతిపదికన నిరుద్యోగ భృతి ఇస్తారు? ఆచరణలో ఎలా సాధ్యం?" అని ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా ఆక్షేపించారు. ఇంతలో ఏమి జరిగిందో తెలియదు గానీ.. రైతులకు మళ్లీ లక్ష వరకు రుణమాఫీ చేస్తామనీ, నిరుద్యోగులకు నెలకు 3,016 రూపాయలను భృతి కింద చెల్లిస్తామనీ, ఆసరా పింఛన్లను 2 వేలకు పెంచుతామనీ, రైతుబంధు పథకం కింద ఇప్పుడు చెల్లిస్తున్న ఎకరాకు 8 వేల రూపాయలను 10 వేలకు పెంచుతామనీ ఘనంగా ప్రకటించారు.




దీనిపై కాంగ్రెస్ నేతలు స్పందిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్లజ్జగా తమ ఎన్నికల ప్రణాళికను కాపీ కొట్టారని విమర్శించారు.

గత ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రుణమాఫీ చేయడానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు ప్రభుత్వాలు కూడా మూడు నాలుగేళ్ల సమయం తీసుకున్నాయి. ఇచ్చిన హామీల అమలుకు అవస్థలు పడుతూ కూడా ఇప్పుడు కొత్తగా హామీలిస్తున్నారు. ప్రతిపక్షంలో ఉన్నవారు అధికారంలోకి రాకపోతే అన్యాయమైపోతామన్న ఆందోళనతో నోటికొచ్చిన హామీలన్నీ ఇస్తున్నారు. రాజకీయ పార్టీలు అధికారంలోకి వచ్చేది ప్రజల డబ్బును పంచడానికేనా?

అభివృద్ధి కార్యక్రమాల అమలుకు అప్పులు చేస్తూ ప్రభుత్వ ఆదాయాన్ని మాత్రం తాము అధికారంలోకి రావడానికై ఎడాపెడా ఖర్చు చేస్తున్నారు. సమాజంలోని అట్టడుగు వర్గాలవారినీ, నిరుపేదలను ఆదుకోవలసిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుంది. అంతమాత్రాన సంక్షేమం అన్న మాటకే అర్థాన్ని మార్చి ప్రజలను సోమరిపోతులుగా చేసే పథకాలు ప్రకటించడం ఏమిటి? ప్రభుత్వాల వద్ద ఆదాయం కుప్పలుతెప్పలుగా ఉండి ఉంటే పౌరసమాజాన్ని నిర్వీర్యం చేస్తున్న మద్యపానాన్ని నిషేధించవచ్చు కదా? ప్రజలను మద్యానికి బానిసలుగా మారుస్తూ, దాని ద్వారా వచ్చే ఆదాయంతో సంక్షేమ పథకాలంటూ విచ్చలవిడిగా ఖర్చు చేయడం బాధ్యతారాహిత్యం కాదా? ప్రజల ప్రాథమిక హక్కులైన

విద్య, వైద్య రంగం నుంచి ప్రభుత్వాలు తప్పుకొంటూ వరాల పేరిట ప్రజలను యాచకులుగా మార్చడం ఎక్కడి రాజనీతి? తెలుగునాట ఇంతవరకు పాఠశాలలు, ఆసుపత్రులలో మౌలిక సదుపాయాలకే దిక్కులేదు. ప్రభుత్వ ఆసుపత్రులలో సరిపడినన్ని పడకలు కూడా ఉండవు. పాఠశాలల్లో మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలు ఉండవు. సీజన్ మారినప్పుడల్లా ప్రజలు అంటువ్యాధులతో అల్లాడుతున్నారు. రోడ్డు ప్రమాదాల్లో ఏటా వేలమంది చనిపోతున్నారు. అయినా వీటి గురించి ఆలోచించే తీరిక ప్రభుత్వాలకు ఉండదు. బాధ్యతాయుతమైన, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి బాధ్యత తీసుకోవలసిన ప్రభుత్వాలు అత్యంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నాయి. ప్రజలు కష్టపడి కడుతున్న పన్నులను సంక్షేమం పేరిట పంచి పెట్టి, అధికారాన్ని కొనుక్కునే దుష్టసంస్కృతికి ఇప్పుడు తెరలేచింది. సంక్షేమం పేరిట పేరుకు పేరు, అధికారం కూడా దక్కుతున్నందున నాయకుల ఆలోచనలన్నీ ఆ దిశగానే సాగుతున్నాయి. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి అమలు చేసిన ఫీజు రీఇంబర్స్‌మెంట్ పథకం ఎటువంటి దుష్టపరిణామాలకు దారితీసిందో చూస్తున్నాం. అర్హతలేనివారు కూడా ప్రభుత్వం ఫీజు చెల్లిస్తుంది కదా అని ఇంజినీరింగ్ కోర్సులలో చేరి ఇప్పుడు నిరుద్యోగులుగా మిగిలారు. నిరుద్యోగులను తయారు చేస్తున్నవారే ఎన్నికల సమయంలో వారెక్కడ ఎదురుతిరుగుతారోనని నిరుద్యోగ భృతిని చెల్లిస్తామంటున్నారు. ఇంతకంటే దగాకోరుతనం ఉంటుందా?

## ఈ ప్రశ్నలకు బదులేది?

ప్రజలను వరాల వర్షంలో ముంచుతున్న పార్టీలకు కొన్ని ప్రశ్నలు!

- అసలు అధికారంలోకి రావాలని ఎందుకు అనుకుంటున్నారు?
- మీరు అధికారంలోకి రావడానికై ప్రజలు కష్టపడి సంపాదించి కడుతున్న పన్నులను పప్పు బెల్లాలుగా పంచే అధికారం మీకు ఎక్కడిది?
- ప్రతి ఎన్నికల్లోనూ ఇలాగే సంక్షేమం పేరిట కొత్త కొత్త వరాలను ప్రకటించుకుంటూ పోతే సమాజం ఏమి కావాలి?
- కష్టపడి పనిచేసి బతకాలన్న ఆలోచన నుంచి ప్రజలను దూరం చేస్తే జరిగే అనర్థాలకు ఎవరు బాధ్యత తీసుకుంటారు?
- ఒకరికొకరు పోటీపడుతూ వరాలు ఇచ్చుకుంటూ పోతే ఇతర అవసరాలకు చేస్తున్న అప్పులను చెల్లించాల్సింది ఎవరు?
- సంక్షేమం పేరిట ప్రజల సొమ్ముతో ఓట్లు కొనుగోలు చేసే అధికారం మీకు ఎవరిచ్చారు?
- ఇవ్వాళ మీరు అధికారంలో ఉంటారు. రేపు మరొకరు ఉంటారు.. కానీ మీరు చేస్తున్న దుబారా వల్ల పెరిగిపోతున్న అప్పుల భారాన్ని మీరు మోస్తారా?

మారాం చేస్తున్నారని మీ పిల్లలు ఏది అడిగితే అది ఇవ్వడానికి నిరాకరించే మీరు, ప్రజలు అడగకుండానే ప్రకటించిన హామీల అమలుకు సాలీనా లక్షన్నర కోట్లు కావలసి ఉంటుందని అంచనాగా ఉంది. తెలంగాణ బడ్జెట్ పరిమాణమే లక్షా 80 వేల కోట్ల రూపాయల అయినప్పుడు, లక్షన్నర కోట్ల రూపాయలతో హామీల అమలు ఎలా సాధ్యమో కేసీఆరే చెప్పాలి.

నిరుద్యోగ భృతి విషయానికే వద్దాం. ఆంధ్రప్రదేశ్‌లో నెలకు వెయ్యి వంతున చెల్లిస్తుండగా, ధనిక రాష్ట్రమని గొప్పలు చెప్పుకోవడానికై మూడు వేల వంతున చెల్లిస్తామని అధికార, ప్రతిపక్షాలు ప్రకటించాయి. రోజువారీ అవసరాలకే వెతుక్కునే ఏపీ ప్రభుత్వం, వెయ్యి వంతున నిరుద్యోగ భృతి చెల్లించడం ఎంతవరకు సమంజసం? గతంలో కూడా నిరుద్యోగ భృతిని అమలు చేసిన రాష్ట్రాలు మధ్యలోనే ఆ పథకాన్ని నిలిపివేశాయి. తెలంగాణలో కేసీర్ చెప్తున్నట్టు మూడు వేల వంతున పంపిణీ చేయాలంటే 5 వేల కోట్ల రూపాయలు ఏటా అవసరమవుతాయి. వెయ్యితోనో, మూడు వేలతోనో నిరుద్యోగుల కడుపు నిండుతుందా? పెళ్లిళ్లు చేసుకుని పిల్లాపాపలతో హాయిగా ఉండగలరా? అంటే లేదే! ఇలా భృతి అంటూ పంచి పెట్టే బదులు ఈ 5 వేల కోట్ల రూపాయలను పరిశ్రమలు పెట్టే వారిని ప్రోత్సహించడానికి ఉపయోగిస్తే ఉద్యోగావకాశాలు వాటంతట అవే పెరిగి నిరుద్యోగం లేకుండా పోతుంది కదా! కానీ రాజకీయ పార్టీలు ఆ పని చేయవు. ఉద్యోగాల కల్పన దీర్ఘకాల ప్రక్రియ! ఇప్పుడు కళ్ల ముందున్న ఎన్నికలు దాటాలంటే కుదరదు. అందుకని నిరుద్యోగ భృతి అనే నినాదాన్ని రాజకీయ పార్టీలు నెత్తికెత్తుకున్నాయి. నిరుద్యోగులు నిరుద్యోగులుగానే ఉంటూ ఎవరు ఎక్కువ భృతి ఇస్తే వారికి ఓటు వేసే వారిగా మాత్రమే ఉండాలని పార్టీలు కోరుకుంటున్నట్టుంది. 5 ఏళ్ల క్రితం 2 వందలు ఉండే పింఛన్ మొత్తాలను ఇప్పుడు రెండు వేలకు పెంచుతున్నారు. ఇలా చేయడం వల్ల అధికారంలో ఉన్నవారు దానకర్ణుల వలె కీర్తి గడించవచ్చు గానీ రాష్ట్రం ఆర్థిక పరిస్థితి ఏమి కావాలి? బహిరంగ మార్కెట్లో కిలో బియ్యం ధర 5 రూపాయలు ఉన్నప్పుడు ఎన్‌టీఆర్ 1983లో 2 రూపాయలకు కిలో బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టారు. అప్పుడు దాన్నొక అద్భుతమైన సంక్షేమ పథకంగా కొనియాడారు. ఇప్పుడు బహిరంగ మార్కెట్లో కిలో బియ్యం ధర 50 రూపాయలకు పైగా ఉంది. ప్రభుత్వాలు మాత్రం రూపాయికే కిలో బియ్యం పంపిణీ చేస్తున్నాయి. దీన్ని సంక్షేమం అనాలా? ప్రజల సొమ్ముతో చెలగాటం అనాలా? ఆకలేసినవాడికి అన్నం పెడితే కృతజ్ఞతా భావంతో ఉంటాడు. ఆకలి లేకపోయినా పెట్టడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ఉపాధి హామీ పథకం వల్ల గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయం కూలీల కొరతతో కుదేలవుతోంది. ఉపాధి హామీ పథకం కింద ఒక రోజుకు వచ్చే కూలీలో 20 శాతం ఖర్చు చేస్తే నెలకు సరిపడా బియ్యం దొరుకుతున్నాయి. దీంతో కూలీలు

మద్యం దుకాణాల వైపు పరుగులు పెడుతున్నారు. ఇవ్వాళ తెలుగు రాష్ట్రాలలో ఏ దుకాణాల వద్దా లేనంత రద్దీ మద్యం దుకాణాల వద్ద ఉంటోంది. మద్యం మత్తులో జరుగుతున్న హత్యలు, అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయి. హైదరాబాద్ మహానగరం ఇప్పుడు ట్రాఫిక్ సమస్యతో అల్లాడుతోంది. ఈ సమస్య పరిష్కారానికి మాత్రం నిధులుండవు. వ్యవసాయంలో రైతుల కష్టాలకు కారణం ఏదైనా ఉందంటే అది గిట్టుబాటు ధర లభించకపోవడమే. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాల్సిన ప్రభుత్వాలు ఆ పని చేయకుండా పెట్టుబడి సాయం అంటూ ప్రజల సొమ్మును పంపిణీ చేస్తున్నాయి. తెలంగాణలో అధికార, ప్రతిపక్షాలు ప్రకటిస్తున్న సంక్షేమ పథకాలు ఉత్పాదకమా? అనుత్పాదకమా? అని ఎవరు నిర్ణయించాలి! నిజానికి తెలుగు రాష్ట్రాలలో ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే సంక్షేమ పథకాలు భారీగానే అమలవుతున్నాయి. ఈ నాలుగున్నరేళ్లలో తాము చెప్పినవి, చెప్పనివి కూడా అమలు చేశామని అధికార పార్టీ నాయకులు చెప్పారు. అలాంటప్పుడు కొత్తగా మరిన్ని సంక్షేమ పథకాలు ప్రకటించవలసిన అవసరం ఏమొచ్చిందో వివరిస్తే మంచిది. కాంగ్రెస్ పార్టీని గేలి చేసి ఇప్పుడు ఆ పార్టీ ప్రకటించినవాటినే తాము అమలు చేస్తామని కేసీఆర్ చెప్పడం సమర్థనీయం ఎలా అవుతుంది? అయిదేళ్లలో చేసింది చెప్పుకోవలసిన పార్టీ, కొత్త పథకాల ద్వారా ఓటర్లను ఆకట్టుకోవడానికి ప్రయత్నించడం అంటే ఎక్కడో ఏదో తేడా కొడుతోందని భయపడుతున్నారా?

**మేలుకోవాలి మనమంతా!**

ఇప్పుడు తెలుగునాట సంక్షేమానికి అర్థం – పరమార్థం మారిపోయింది. పథకాల పేరిట ప్రభుత్వ సొమ్ము ఖర్చు చేసి ఎన్నికల్లో ఓట్లు కొనుగోలు చేయడం అనే ప్రక్రియ రాజశేఖర్‌రెడ్డితో మొదలైంది. ఇప్పుడు అది వికృతరూపం దాల్చింది. రైతులకు పెట్టుబడి సాయం చేస్తూనే పంట రుణాలు తీసుకున్న వారందరికీ లక్ష మాఫీ చేస్తామని టీఆర్ఎస్, రెండు లక్షలు మాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీలు ఇవ్వడం సంక్షేమం అవుతుందా? ఓట్ల కొనుగోలు అవుతుందా? రాజకీయ పార్టీలు ప్రకటిస్తున్న సోకాల్డ్ వరాలు వెర్రితలలు వేస్తున్నాయి. ఈ ఎన్నికల్లో ఒడ్డెక్కడానికి ఈ పథకాలు ప్రకటించారు. మరి ఆ తర్వాత అయిదేళ్లకు జరిగే ఎన్నికలలో మళ్లీ గెలవడానికి ఇంకేమి ప్రకటిస్తారో? రాజకీయ పార్టీల ధోరణిని ఇప్పటికే అంతా హేళన చేస్తున్నారు. అమాయకులైన ప్రజలు ఇలాంటివాటి పట్ల ఆకర్షితులు కాకుండా ఉండలేరు. ఊరికే వస్తే ఎవరికి మాత్రం చేదు! సంక్షేమం పేరిట సాగుతున్న వికృత పోటీకి అడ్డుకట్ట పడవలసిన తరుణం ఆసన్నమైంది. ఏ రాజకీయ పార్టీ అయినా తాను ఇచ్చిన హామీని అమలుచేయలేని పక్షంలో అధికారం నుంచి తప్పుకోవాలన్న నిబంధనను విధిగా పెట్టవలసి ఉంది. సొంత మీడియాలో పనిచేసేవారికి ఇవ్వాల్సిన వార్షిక ఇంక్రిమెంట్‌ను కూడా ఆర్థిక పరిస్థితి బాగా లేదని చెప్పి ఇవ్వని జగన్మోహన్‌రెడ్డి, ఏపీలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితితో సంబంధం లేకుండా అడ్డగోలు హామీలను ఇస్తున్నారు. తెలంగాణలో అయినా, ఆంధ్రప్రదేశ్‌లో అయినా సరే ఈ పరిస్థితిలో మార్పు రావాలి. రాజకీయ పార్టీలకు ఎకౌంటబిలిటీ ఉండి తీరాల్సిందే! ఎన్నికలలో గెలవడానికై నోటికొచ్చిన వాగ్దానాలు చేస్తే ఆ తర్వాత అవి తమ మెడకు చుట్టుకుంటాయన్న భయం పార్టీలకు ఉండాలి. ఈ విషయమై దేశవ్యాప్తంగా చర్చ జరగాలి. ఇందుకు అనుగుణంగా చట్టాలను కూడా రూపొందించాలి. రాజకీయ పార్టీలను ఏదో ఒక విధంగా కట్టడి చేయకపోతే బాధ్యతారహితమైన సమాజం ఆవిష్కృతమవుతుంది. ఎవరో ముఖ్యమంత్రులుగా అవడం కోసం ప్రజాధనాన్ని పప్పుబెల్లాల్లా పంచే అధికారం లేదని పౌరసమాజం నుంచి కూడా ఒత్తిడి రావాలి. కేసీఆర్, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, చంద్రబాబు, జగన్మోహన్‌రెడ్డి, పవన్‌కళ్యాణ్‌లను ముఖ్యమంత్రి చేయడానికై మేం పన్నులు కట్టడం లేదని పన్నులు చెల్లించేవారు నినదించాలి. ప్రభుత్వాల నుంచి ఏ సహాయం పొందకుండా మిగిలిపోతున్నది పన్ను చెల్లింపుదారులే! ఎవరో కష్టపడి సంపాదించి కట్టే పన్నులను మరెవరో పంచిపెట్టడం ఎక్కడి విధానం? ఏదో ఒక పార్టీ అధికారంలోకి రావడం కోసం సాగుతున్న ఈ విచ్చలవిడితనం ఇలాగే కొనసాగితే పౌర సమాజం నిర్వీర్యం కాకుండా ఎలా ఉంటుంది? 119 అసెంబ్లీ స్థానాలకు జరిగే ఎన్నికలలో మెజారిటీ సీట్లు సాధించుకోవడానికై లక్షన్నర కోట్లు ఖర్చు చేయడమేంటి? అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్టు ప్రజల సొమ్మును విచ్చలవిడిగా ఖర్చు చేసే అధికారం రాజకీయ పార్టీలకు లేదని పౌర సమాజం స్పష్టం చేయాలి. సోమరిపోతులు, తాగుబోతులమయంగా సమాజాన్ని మార్చడాన్ని అనుమతిస్తే అందరమూ నష్టపోతాం. అధికారం అనుభవించేవాళ్లు బాగానే ఉంటారు. హద్దు మీరుతున్న సంక్షేమం మాయలోకి ప్రజలను తోసి పబ్బం గడుపుకునే ప్రయత్నాలను ప్రజలే అడ్డుకోవాలి. లేని పక్షంలో 'యథా ప్రజా – తథా రాజా' అని సర్దిచెప్పుకోవలసిన రోజు వస్తుంది. అప్పుడు చింతించినా ప్రయోజనం ఉండదు. విషాదం ఏమిటంటే సమాజాన్ని, ప్రజలను చైతన్యపరచవలసిన వ్యవస్థలు, వ్యక్తులు తెలుగునాట కనుమరుగవడం! చట్టాలు చేయడానికి రాజకీయ పార్టీలు సహకరించవు కనుక వాటి కట్టడికి విజిల్ బ్లోయర్స్ అవసరం ఉందని ప్రస్తుత ధోరణులు మరోసారి గుర్తు చేస్తున్నాయి. నాయకులు మహానుభావులుగా పిలిపించుకోవడానికై ప్రజలను మహాయాచకులుగా మార్చడం వాంఛనీయమూ, సమర్థనీయమూ కానే కాదు! ✧

(ఆంధ్రజ్యోతి ఆర్కే 'కొత్తపలుకు' కాలమ్ నుంచి)

# ఎటు చూస్తే అటు స్వర్గం!

- కె.రామచంద్రమూర్తి



ప్రజాస్వామ్య ప్రక్రియ వికృతంగా మారి ప్రాణవాయువును క్రమంగా హరిస్తోంది. ఢిల్లీ పర్యావరణం లాగానే దేశమంతటా ప్రజాస్వామ్య వ్యవస్థ ఊపిరాడక కొట్టుమిట్టాడుతోంది. కొంతకాలంగా సంభవిస్తున్న పరిణామాలు గమనిస్తున్నవారిని భవిష్యత్తు ప్రశ్నార్థకంగా కనిపించి కలవరపెడుతున్నది. ఎన్నికలు జూదంగా మారినప్పుడు, అర్థబలం, అంగబలం ఉన్నవారు మాత్రమే ఎన్నికలలో పోటీ చేయగల పరిస్థితులు దాపురించినప్పుడు, వ్యాపారులే రాజకీయవాదులూ, రాజకీయవాదులే వ్యాపారులూ అయినప్పుడు అంబేద్కర్ ఆశించిన రాజ్యాంగబద్ధమైన పరిపాలన, స్వాతంత్ర్య సమరయోధులు అభిలషించిన స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు లుప్తమైనప్పుడు ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిపోతుంది.

**కీలకమైన ఎన్నికలు**

తెలంగాణతోపాటు నాలుగు రాష్ట్రాల శాసనసభలకు నవంబర్, డిసెంబర్ మాసాలలో ఎన్నికలు జరగబోతున్నాయి. పోటీ చేసే అభ్యర్థులలో కొంతమంది మొదటిసారి బరిలో దిగబోతున్నవారు. అనుభవజ్ఞులు మరికొందరు. శాసనసభ్యుల విధులూ, విధానాలు ఏమిటో చాలా తక్కువమంది అభ్యర్థులకు తెలుసు. భారత రిపబ్లిక్ ఏర్పడి 1952లో తొలిసారి ఎన్నికలు జరిగిన దరిమిలా తొలి రెండు తరాల ప్రజాప్రతినిధులకు తమ విధ్యుక్తధర్మం ఏమిటో తెలిసేది. ఆ తర్వాత రాజకీయాలు క్రమంగా మేధావులనూ, సామాజిక సేవకులనూ, నిజాయితీపరులనూ పక్కనపెట్టి వ్యాపారులకూ, పారిశ్రామికవేత్తలకూ, నేరచరితులకూ, అక్రమార్కులకూ పెద్దపీట వేశాయి. ప్రజలకు చట్టసభలలో ప్రాతినిధ్యం వహించవలసిన ఎంఎల్ఏలు చట్టాలు చేయడంలో, పరిపాలనపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో భాగస్వాములు కాకపోతే వారు కర్తవ్య నిర్వహణలో విఫలమైనట్టే. ప్రజాప్రతినిధుల పాత్ర అద్వితీయమైనది. వారిని ఎన్నుకునే ప్రక్రియ పవిత్రమైనది. దాన్ని భ్రష్టుపట్టకుండా చూసుకోవలసిన గురుతర బాధ్యత ప్రజలది.

**అలవికాని వాగ్దానాలు**

ప్రతి రైతు కుటుంబానికీ రెండు లక్షల రూపాయల రుణం మాఫ్ చేస్తామనీ, ప్రతి నిరుద్యోగికీ రూ. 3,000 నెలసరి భత్యం ఇస్తామనీ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ తెలంగాణ ఎన్నికల ప్రచారంలో వాగ్దానం చేశారు. టీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు (కేసీఆర్) సైతం ఇదే తరహా వాగ్దానాలు చేశారు. ప్రతి రైతు కుటుంబానికీ లక్ష రూపాయల రుణం మాఫ్ చేస్తామనీ, ప్రతి నిరుద్యోగికీ రూ. 3,016లు నెలనెలా చెల్లిస్తామనీ హామీ ఇచ్చారు. ఆసరా పింఛన్లు రెట్టింపు చేస్తామనీ, డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టించి ఇస్తామనీ, రాష్ట్ర ఆదాయం పెంచుతూ, దాన్ని ప్రజలకు పంచుతూ పోతామని వాగ్దానం చేశారు. రైతుల కోసం ప్రవేశపెట్టే 15 పథకాలలో 72 లక్షల మంది రైతులకు కనీసం మూడు పథకాల ద్వారా లబ్ధి కలుగుతుందని కేసీఆర్ చెప్పారు. పకడ్బందీగా లెక్కలు వేసిన తర్వాతే వాగ్దానాలు చేస్తున్నామంటూ నాయకులు చెప్పినా ప్రజలకు వారి అనుభవం నుంచి పుట్టిన అనుమానాలు ఉంటాయి. అమలు అసాధ్యమని తెలిసినా శక్తికి మించిన వాగ్దానాలు చేస్తున్నారనే విషయం గ్రహిస్తారు. భారత ప్రజాస్వామ్య చరిత్రలో అధికారంలోకి వచ్చిన తర్వాత వాగ్దానాలు బొత్తిగా అమలు చేయని పార్టీలు ఉన్నాయి. పాక్షికంగా అమలు చేసిన పార్టీలూ ఉన్నాయి. కాంగ్రెస్ నాయకులు చేస్తున్న వాగ్దానాలు అమలు చేయాలంటే దక్షిణాది రాష్ట్రాల బడ్జెట్లు అన్నీ కలిపినా నిధులు సరిపోవని ఐటీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) వ్యాఖ్యానించారు. ఆ తర్వాతనే కేసీఆర్ నిరుద్యోగ భృతి వాగ్దానం చేశారు. కేసీఆర్ 2014

నుంచి నాలుగు వాయిదాలలో రుణమాఫీ చేశారనీ, అట్లా కాకుండా కాంగ్రెస్‌ని గెలిపిస్తే మొత్తం రుణమాఫీ ఒకే విడతలో చేస్తామని రాహుల్‌గాంధీ ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌లో నిరుద్యోగ భృతి రెండువేల రూపాయల చొప్పున చెల్లిస్తామని వాగ్దానం చేసి 2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం నాలుగున్నర సంవత్సరాల పాటు నయాపైసా చెల్లించకుండా ఇప్పుడు నెలకు రూ.1000 చొప్పున ఇస్తానని చెబుతున్నది. దానిలో కూడా అనేక మినహాయింపులతో లబ్ధిదారుల సంఖ్యను కుదించవలసి వస్తున్నది. ఏ పార్టీ అయినా చేస్తున్న వాగ్దానాలు అమలుకు యోగ్యమైనవా, కావా అని నిర్ణయించవలసిన బాధ్యత ఎన్నికల సంఘం స్వీకరించాలి. ప్రజల హృదయాలను ఏదో ఒక విధంగా గెలుచుకోవాలనే ఆరాటంలో అలవికాని వాగ్దానాలు పార్టీలు చేస్తాయి. వాగ్దానాలు అమలు చేయని పార్టీలను అయిదేళ్ల తర్వాత ప్రజలు శిక్షించవలసిందే కానీ వాగ్దానాలు అమలు చేయించే వ్యవస్థ లేదు. ఆర్థిక నిపుణులతో, సామాజికవేత్తలతో ఉన్నతస్థాయి సంఘాన్ని నియమించి, వివిధ పార్టీలు చేస్తున్న వాగ్దానాలు అమలు సాధ్యమో కాదో నిర్ణయించవలసిందిగా ఎన్నికల కమిషన్ ఆదేశించాలి. అమలు సాధ్యం కానివి ఎన్నికల ప్రణాళిక నుంచి తొలగించాలని పార్టీలను కట్టడి చేయాలి. వాగ్దానాలు సంపూర్ణంగా అమలు చేయాలంటే ఎంత ఖర్చు అవుతుంది? ఆ రాష్ట్ర బడ్జెట్ ఎంత? ఉద్యోగుల జీతభత్యాలూ, ఇతర ప్రభుత్వ ఖర్చులకూ ఎంత కేటాయించాలి? మిగిలిన మొత్తంలో అభివృద్ధి కార్యక్రమాల కోసం ఎంత ఖర్చు చేయాలి? అభివృద్ధి వ్యయానికీ, సంక్షేమ వ్యయానికీ మధ్య సమతౌల్యం పాటిస్తూ సంక్షేమం కోసం ఎంత ఖర్చు చేయవచ్చు? సంక్షేమం కోసం కేటాయించిన మొత్తంలో పార్టీలు చేస్తున్న వాగ్దానాల అమలు సాధ్యమేనా? వైద్య, విద్యారంగాల నుంచి ప్రభుత్వాలు పూర్తిగా నిష్క్రమించి, ప్రత్యామ్నాయ సంక్షేమ పథకాలు అమలు చేయడం మంచిదా లేక ప్రభుత్వ ఆసుపత్రులనూ, విద్యాలయాలనూ పటిష్ఠం చేయడం ఉత్తమమా అనే అంశం కూడా ఎన్నికల ప్రచారంలో చర్చకు పెట్టాలి. పన్నులు పెంచుతూ, ఆదాయాన్ని సంక్షేమం పేరు మీద పంచుతూ పోతే అభివృద్ధి ఎట్లా సాధ్యం? తన జేబు నుంచి తీసి రైతులకు, నిరుద్యోగులకూ ఇస్తామన్నట్టు మాట్లాడుతున్న నేతలు అభివృద్ధి కార్యక్రమాల గురించి పెద్దగా వివరించడం లేదు. రాష్ట్రాల వనరులు ఏమిటో, వాటిని వినియోగించి అభివృద్ధికి సోపానాలు ఏట్లా వేయాలని పార్టీలు ఆలోచిస్తున్నాయో తెలియదు. పౌరులు తమ కాళ్లపైన తాము నిలబడే విధంగా ప్రభుత్వం ఎటువంటి పరిస్థితులు కల్పించగలదో తెలియజేయడం లేదు. విదేశాలలో దాచిన నల్లధనం తెచ్చి ప్రతి పౌరుడి బ్యాంకు ఖాతాలో రెండున్నర లక్షలు డిపాజిట్ చేస్తానంటూ బీజేపీ ప్రధాని అభ్యర్థిగా నరేంద్రమోదీ వాగ్దానం చేసి అభాసుపాలు కాలేదా? గెలుపు ముఖ్యం. అందుకోసం అరచేతిలో వైకుంఠం చూపిద్దాం. గెలిచిన తర్వాత చూసుకుందాం అనే ధీమా పార్టీల చేత చాంతాడంత వాగ్దానాలు చేయిస్తున్నది.

**ఫిరాయింపుల నిరోధం**

మరో అత్యంత ప్రమాదకరమైన అంశం ఫిరాయింపు. ఫిరాయింపుల నిరోధం కోసం రాజీవ్‌గాంధీ, వాజపేయి ఎంత కృషి చేసినా చట్టం చట్టుబండలై ఫిరాయింపుల వ్యాపారం నిస్సిగ్గుగా సాగిపోతోంది. రాజ్యాంగాన్ని కొందరు ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘిస్తుంటే రాజ్యాంగబద్ధమైన ఉన్నత పదవులలో ఉన్నవారు ఆక్షేపించడం కూడా మానివేశారు. కొన్ని సందర్భాలలో ఉన్నత పదవులలో ఉన్నవారే ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారు. ఏకంగా మంత్రివర్గాలే ఫిరాయించడం మన ప్రజాస్వామ్య వ్యవస్థలో చెప్పుకోదగిన విశేషం. ఈ ఆత్మహననం నిర్నిరోధంగా కొనసాగుతోంది.

ఉదాహరణకు గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ అనారోగ్యం కారణంగా అక్కడ కొత్త ముఖ్యమంత్రికి పగ్గాలు అందించాలి. అందుకు అవసరమైన మెజారిటీ అధికార బీజేపీకి లేదు. అందుకని ఒక రోజు ఇద్దరు కాంగ్రెస్ ఎంఎల్ఏలను ఢిల్లీకి విమానంలో రప్పించుకుని కేంద్ర విద్యుచ్ఛక్తి మంత్రి పీయుష్ గోయెల్ బీజేపీ కండువాలు దర్జాగా కప్పేశారు. ఆ విధంగా మెజారిటీ లేమి సమస్యను అధిగమించారు. ఆ క్రమంలో రాజ్యాంగాన్ని మరోసారు కుళ్లబడిచారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని ఉల్లంఘించి తన ఎంఎల్ఏలను 'కొనుగోలు' చేస్తుంటే కాంగ్రెస్ కూడా గట్టిగా ప్రశ్నించకపోవడం, ఇది సర్వసాధారణమైనట్టు మీడియా సైతం మిన్నకుండటం దేశంలో ప్రజాస్వామ్యం మనుగడ పెద్ద ప్రశ్నార్థకంగా మారిందనడానికి ప్రబల నిదర్శనం.

### ప్రజాస్వామ్య రక్షణకు తక్షణ చర్యలు

ఈ దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ బతికి బట్టకట్టాలంటే కొన్ని నిర్దిష్టమైన చర్యలు తీసుకోవడం అత్యవసరం. 1. ఎన్నికలలో ధన ప్రభావాన్ని తగ్గించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలి. ఎన్నికలకు ఇంకా నెలన్నర సమయం ఉండగానే తెలంగాణలో రూ.59 లక్షల నగదుతో వెళుతున్న కారును పోలీసులు పట్టుకున్నారు. మహారాష్ట్ర నుంచి కర్ణాటకకు కారులో తీసుకొని వెడుతున్న రూ.2 కోట్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడకపోతే ఇది బహుశా రాయలసీమకు వెళ్లి ఉండేది. పోలీసులు పట్టుకోలేనివి ఇంతకు అనేక రెట్లు ఉంటాయి. అసలు ఇంత నల్లధనం ఎట్లా ఉత్పత్తి అవుతున్నదో తెలుసుకోవాలి. ఒక ప్రాంతీయపార్టీ ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగినప్పుడు అక్కడి పార్టీలకు నిధులు ఎట్లా సమకూర్చుతున్నదో తెలుసుకోవాలి. 2. నల్లధనం వనరులలో ముఖ్యమైనవి నీటిపారుదల ప్రాజెక్టులూ, రోడ్ల నిర్మాణం, విద్యుచ్ఛక్తి ప్రాజెక్టులు, ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణవ్యయాన్ని పెంచడం పారదర్శకంగా జరిగే విధంగా చూసేందుకు రాజ్యాంగబద్ధమైన వ్యవస్థ ఏర్పాటు కావాలి. దానికి సమాంతరంగా పౌరసమాజం తరపున కూడా ఒక నిఘావ్యవస్థ నిర్మాణం జరగాలి. ఇరిగేషన్, రోడ్డు నిర్మాణం వంటి పనుల కాంట్రాక్ట్ ఏరకంగా ఇస్తున్నారో పరిశీలించాలి. టెండర్లు పిలుస్తున్నారా లేక నామినేషన్ పద్ధతిలో అస్మదీయులకు కట్టబెడుతున్నారో గమనించాలి. ఇది కేవలం అధికార పార్టీకి వదిలివేయవలసిన అంశం కాదు. ప్రాజెక్టుల పేరు మీద అప్పులు చేస్తున్నారు. అవి ఏరకంగా ఖర్చు అవుతున్నాయో ప్రజలు తెలుసుకోవాలి. 4. సమాచార హక్కు చట్టాన్ని అమలు చేయడమే కాకుండా అడగకుండానే వివరాలు ఇచ్చే పద్ధతి (డ్యూటీ టు రిపోర్ట్) ప్రవేశపెట్టాలి. 5. గ్రామపంచాయతీలకూ, స్థానిక సంస్థలకు క్రమం తప్పకుండా ఎన్నికలు విధిగా జరిపించాలి. స్థానిక సంస్థల విధులూ, నిధులూ వికేంద్రీకరించాలి. జన్మభూమి కమిటీల వంటి సమాంతర పక్షపాత వ్యవస్థను రద్దు చేయాలి. ఇలాంటి కమిటీలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. 6. ఫిరాయింపుల నిరోధానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. 2003లో ఆ చట్టానికి చేసిన సవరణలు సరిపోవని తేలిపోయింది. ఫిరాయింపుదారులపై అనర్హత వేటు వేసే అధికారం సభాపతుల నుంచి తొలగించాలి. ఒకవేళ దాన్ని మార్చకూడదనుకుంటే ఫలానా గడువులోగా నిర్ణయం తీసుకోవాలనే నిబంధన పెట్టాలి.

స్పీకర్ నిర్ణయాన్ని పరిశీలించి తిరస్కరించే లేదా ఆమోదించే అధికారం హైకోర్టుకు ఉండాలి. గడువులోగా సభాపతి నిర్ణయం తీసుకోకపోతే ఎన్నికల సంఘం జోక్యం చేసుకోవాలి. ముఖ్యమంత్రుల దగ్గర 'జీహుకుం' అనే స్పీకర్లకు నిర్ణయాధికారాలు ఇవ్వడం, ఈ విషయంలో న్యాయస్థానాలు జోక్యం చేసుకోరాదంటూ ఆంక్ష విధించడంతో ఫిరాయింపులు పగ్గాలు తెంచుకుని జోరుగా సాగుతున్నాయి. నైతిక విలువలు లుప్తమైన పార్టీలు అధికారంలో ఉండటంతో అవినీతి రాజకీయానికి హద్దూపద్దూ లేకుండా పోతున్నది. ఈ విశృంఖలత్వాన్ని అరికట్టకపోతే దేశంలో ప్రజాస్వామ్యం నేతిబీరకాయలో నేతి చందం అవుతుంది. ✧

(సాక్షి సౌజన్యంతో)

# ఉచితాలకు మోసపోవద్దు: లోక్‌సత్తా పార్టీ



రానున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి తెలంగాణ రాష్ట్రంలో అన్ని పార్టీలు ఇస్తున్న ఉచిత హామీలతో రాష్ట్రం ఆర్థికంగా దెబ్బతింటుందని, ప్రజలు దీర్ఘకాల ప్రయోజనాల్ని నష్టపోతారని లోక్‌సత్తా పార్టీ సూర్యాపేట నేత పల్లేటి రమేష్ అన్నారు. నిరుద్యోగ భృతి వల్ల నిరుద్యోగం పోదని, నిరుద్యోగుల మనోధైర్యం దెబ్బతింటుందని అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఓటర్లకు ఉచితాలు, తాయిలాల పథకాలను ప్రకటించటంతోపాటు డబ్బు, మద్యం, ఇతర ప్రలోభాలతో కూడా ఆకట్టుకుని బలహీనుల్ని చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రజలకు కావలసిన నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిరహిత సేవలు వంటి వాటి కోసం ఎన్నికల్లో ప్రజలు డిమాండ్ చేయాలన్నారు. సైదులు, విజయ్, గోపి, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

# 'చట్టబద్ధపాలన' మన ప్రాథమిక హక్కు - ప్రభుత్వ తొలి బాధ్యత

- పి.వి గోపాలకృష్ణ

Right of law is our fundamental right అంటే, చట్టబద్ధపాలన మన ప్రాథమిక హక్కు. అంతేకాదు, ప్రభుత్వ తొలి బాధ్యత.

ఆర్టికల్ 19లో ఎక్కడ అలా రాసుందోనని వెతక్కండి. రాజ్యాంగంలో ఆర్టికల్ 19లో ప్రత్యేకంగా ప్రాథమిక హక్కుల లిస్టులో లేకపోయినా.. రాజ్యాంగబద్ధ, చట్టబద్ధ సుపరిపాలన మన ప్రాథమిక హక్కు. అదే Rule of Law. దానికి మన రాజకీయ నాయకుల అనుమతీ అక్కర్లేదు. పార్లమెంటులో వారు దయతలచి మనకి మరో చట్టం చేయవలసిన అవసరమూ లేదు.

కానీ, ఇన్ని దశాబ్దాలలో మనం సాధించుకున్నదేమిటయ్యా అంటే, "Failure of good governance". It "is the obvious root cause for the current unsafe environment eroding the rule of law, and not the want of needed legislation" అని జస్టిస్ వర్మ కమిటీ అభిప్రాయం.

మంత్రైనా, ప్రజాప్రతినిధైనా, ప్రభుత్వోద్యోగైనా, కోర్టయినా రాజ్యాంగబద్ధంగానూ, చట్టబద్ధంగానూ వారి వారి కర్తవ్యాలను నిర్వర్తించాలి. అది వారి ప్రాథమిక బాధ్యత. ఈ చట్టబద్ధపాలనే సుపరిపాలనకు ఆధారం. అందువల్ల ప్రజాస్వామ్యంలో అది మన ప్రాథమిక హక్కు. ఆర్టికల్ 19లోనే మరెక్కడా అలా రాసుండనక్కర్లేదు. సుపరిపాలన అంటే Rule of Law.

చట్టం తన పని తాను చేసుకుపోవడం.. రాజకీయ నాయకుల నోట ఈ మాట జోకులా తయారైంది. దానికి కారణం- మన పాలకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు చట్టాలను అమలుపరిచే తీరులో without fear and favour అన్న నియమాన్ని విస్మరించడం. తనదాకా వస్తే ఒకలా, పక్కవాడికైతే మరోలా. లా (చట్టం) ఒక్కోసారి ఒక్కోలా రూపాంతరం చెందక కేవలం Rule of Law. రాజ్యం చేస్తే పరిస్థితులు మరోలా ఉండేవేమో. కానీ మనదేశంలో




రాజ్యమేలుతున్నది వ్యక్తిపరమైన పాలన. కుర్చీలో కూర్చున్న వ్యక్తి ఉద్దేశించకపోయినా.. అధికారం హస్తగతం చేసుకోవడంలోను, చెలాయించడంలోను, అవకాశాలు దొరకబుచ్చుకోవడంలోను, కుటుంబ సభ్యులు, ఆ వెనుకే బంధుగణం, ఆ తర్వాత మిత్రులు, నమ్మకస్తులు, దళారులు.. అలా వడ్డించేవాడి చుట్టూ ఉంటే, సామాన్యుడు ఎక్కడో చివరి వృత్తంలో ఉంటాడు. మొదటి రెండు మూడు వృత్తాలోకి దూరి అధికార సామీప్యం కోసమే మనలో దాదాపు అందరి తాపత్రయం. సింహాసనం అధిష్టించగలిగిన ఆ నాయకుడి కరుణాకటాక్ష వీక్షణాల కోసం, దయతో పడేసే అధికార ఫలాల కోసం అర్రులు చాచటానికి అభ్యంతరంలేని జనం చుట్టూ ఉంటే, ఇంకా Rule of Law ఎక్కడుంటుంది? చట్టబద్ధమో కాదో.. ప్రభుత్వ కార్యాలయంలోనూ, పోలీస్ స్టేషన్‌లోనూ, మరెక్కడైనా సరే అధికార జులుం చూపించలేని వాడూ ఓ ప్రజాప్రతినిధా, మంత్రా, అధికారా? చట్టం తన పని తాను చేసుకుపోతుంది అంటూనే దానికి అడ్డుతగిలితేనే వాడు ప్రజాప్రతినిధి, మంత్రి, అధికారి. అలా చెయ్యలేనివాడు ఉంటే ఎంత, (ఉండక)పోతే ఎంత? అలా తమ ఉనికిని 'ప్రజా'రంజకంగా చాటుకో గలిగినవాడు సింహాసనంలో కూర్చుని

ఉంటే మనం చూసేది చంద్రబాబు కాకపోతే జగన్, కేసీఆర్ కాకపోతే మరొకరు. ఈ ఒరవడిలోనే 'ప్రజ'లకీ తగిన వంశపారంపార్య నాయకులు తయారవుతుంటారు సింహాసనాన్ని అధిష్టించటానికి. అందరూ తమ 'ప్రజా'భిప్రాయానికి అనుగుణంగా 'పాలనా నిర్వహణ' చెయ్యాలనుకునేవారే కదా, ఆ ప్రజలంటే ఎవరన్నదే అసలు ప్రశ్న. కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు, వ్యాపారభాగస్వాములు, ఆంతరంగికులు, నమ్మకస్తులు, దళార్లు కానివాళ్లు ప్రజలేనా? వీరందరినీ దాటుకుని బయటి ప్రజానీకానికి అనువైన నిర్ణయాలు చట్టబద్ధంగా జరుగుతాయన్న నమ్మకంతో నిశ్చింతగా నిద్రపోగలిగే స్థితిలో నిజంగా సామాన్యుడున్నాడా? ప్రజాజీవితానికి సంబంధించిన నిర్ణయాలు పక్షపాతంతోనో, తనకన్నా పైనున్నవాడి మెప్పుకోసమో, ప్రాపకం కోసమో, భయంవల్లో కాకపోతే.. ఈరోజు మనం మంత్రులను, అధికారులను (బహుకొద్దిమందినే అనుకోండి) జైళ్లలో పెట్టే పరిస్థితి వచ్చేది కాదు.

Subversion of Law - చట్టవిద్రోహం, Abuse of Power - అధికార దుర్వినియోగం, Dereliction of Duty - కర్తవ్య నిర్వహణలో నిర్లక్ష్యం, అలసత్వం - ఈ మూడూ చట్టం తన పని తాను చేసుకోవడానికి ప్రతిబంధకాలు. అధికార మైకం తలకెక్కినవారికి, వారికి దగ్గరలోని రెండు మూడు వృత్తాల్లోని బంధుగణ అస్మదీయులకి త్వరగా అంటుకునే రోగాలివి. దీని వల్ల ప్రజాస్వామ్యంలో మొదట నిర్వీర్యమయ్యేది Rule of Law చట్టబద్ధపాలన చట్టుబండలవుతుంది. మంత్రులు - ప్రధానమంత్రులు, ముఖ్యమంత్రులు సహా, అధికారులు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌ల దగ్గర్నుంచి డిస్పాచ్ క్లర్కుల దాకా, జడ్జీలు, అడ్వకేట్ జనరళ్లు, అటార్నీ జనరల్, గవర్నమెంట్ ప్లీడర్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ల దాకా విచక్షణాధికారం చెలాయించగల అధికారగణం అంతా ఈ రోగాలపీడితులే. నిర్భయంగా తప్పుడు అవకాశవాద నిర్ణయాలు తీసుకోవడం ఈ రోగాల లక్షణం. చట్టాన్ని ఎలాగంటే అలా వంచగలం అన్న ధీమా, అహంకారం, రాజును మించిన రాజభక్తి ఈ రోగాలకు Breeding Grounds.. ఈ రోగాల బారినపడితే వ్యక్తిపరమైన పాలనే Rule of Law. గా చెలామణి అవుతుంది.

ఒక్కసారి ఓటేశాక, ప్రజల యొక్క ప్రజల కొరకు, ప్రజల వలన (of the people, for the people and by the people) అంటూ ప్రపంచంలోనే అతిపెద్ద 'ప్రజాస్వామ్యం' అనుకుంటున్న మనదేశంలో ప్రజలకి చట్టాలు తయారుచేసే ప్రక్రియలో భాగస్వామ్యం లేదు. కొన్ని అంశాలలోనైనా.. ప్రజాభిప్రాయ సేకరణ చట్టరూప కల్పనలో భాగం కాకపోవడం విషాదం. ఒక బిల్లు చట్టంగా మారే ప్రక్రియలో ప్రజలు పాలుపంచుకునే అవకాశం చాలా స్వల్పం.

త్రేతాయుగంలో ధర్మం నాలుగు పాదాల మీద నడిచేదట. ఇప్పుడు కలి ముదిరి ఒంటికాలి మీద కుంటుతోందట. అంటే Rule of Law. మీద మనకున్న దృష్టి, గౌరవం ఎంతో తెలుస్తోంది. ప్రభుత్వ అధికారగణంలో అలసత్వాన్ని నియంత్రించడానికి శాఖాపరమైన క్రమశిక్షణా చర్యలకి నిబంధనలున్నాయి. కాగితాల మీద. ఆచరణలో ఏ ఉద్యోగి మీద ఏ విషయంలో అలసత్వానికి ఏ క్రమశిక్షణ చర్య తీసుకున్నారు అని ఎప్పుడైనా ప్రభువులకి.. అంటే మనకి.. అంటే ప్రజలకి చెప్పే ప్రయత్నం జరిగిందా? సెక్షన్ 4, ఆర్‌టీఐ చట్టం కింద ప్రతి పబ్లిక్ అథారిటీ ఆయా శాఖలకి సంబంధించిన విషయాలన్నీ ప్రజలకు అందుబాటులో ఉంచాలి. చట్టబద్ధపాలన ఉంటే ప్రత్యేకంగా అడగక్కర్లేకుండానే ప్రభుత్వం పనిచేసే తీరును బట్టి ఇట్టే మనకి తెలిసిపోతుంది. అది సుపరిపాలన.

Subversion of Law - చట్టవిద్రోహం, Abuse of Power -అధికార దుర్వినియోగం, Dereliction of Duty - కర్తవ్య నిర్వహణలో నిర్లక్ష్యం, అలసత్వం - ఇవి దేశద్రోహాలు. మన సేవకులు, బయట స్టూల్ మీద కూర్చుని తన పవర్ చూపించగలిగే బంట్రోతు నుంచి దేశాధ్యక్ష సింహాసనం మీద కూర్చునేవారిదాకా, గాడి తప్పి ప్రవర్తిస్తే శిక్షించడానికి, సమాచార హక్కు చట్టం సక్రమంగా అమలుచేయటంతోపాటు 'పౌర సేవల' (రైట్ టూ సర్వీసెస్-ఆర్టీఎస్, సర్వీస్ గ్యారంటీ) చట్టం తేవాలి. ఈ రెంటితోపాటు Subversion of Law, Abuse of Power, Dereliction of Duty... చట్ట విద్రోహం, అధికార దుర్వినియోగం, కర్తవ్య నిర్వహణలో అలసత్వ నిరోధాని (prevention) కి తగిన ఎన్నికల, న్యాయ, పోలీసు సంస్కరణల్ని కూడా తెచ్చినప్పుడే ప్రజాస్వామ్యంలో ప్రజలు తిరిగి సార్వభౌమాధికారాన్ని పొందగలుగుతారు. ✧

# మహిళలపై వివక్ష అనుకున్నంత వేగంగా తగ్గటం లేదు -తెలంగాణ సామాజికాభివృద్ధి నివేదిక 2018-

తెలంగాణలోని పలు జిల్లాల్లో మహిళల స్థితిగతుల్లో ఆశించినంత మార్పు రావటం లేదు.

స్త్రీలలో రక్తహీనత అధికంగా ఉంది. కొన్ని జిల్లాల్లోనైతే సగానికిపైగా మహిళలు ఈ సమస్యతో బాధపడుతున్నారు. దేశ సగటుకన్నా ఇది అధికం. విద్య విషయంలో బాలబాలికల మధ్య తారతమ్యాలున్నాయి.

బాలికలు, మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు అనుకున్నంత వేగంగా మారడం లేదు. సాంప్రదాయాలు, కట్టుబాట్లతోపాటు నిరక్షరాస్యత, పేదరికం కారణంగా ఇంకా చాలాచోట్ల మహిళలపై వివక్ష కొనసాగుతోంది (రాష్ట్ర కేబినెట్‌లో ఒక్క మహిళా లేకపోవటాన్ని కేవలం రాజకీయ విమర్శగా చూడలేం).

చదువుకోవాలని ఆశపడినా చాలాచోట్ల బాలికలను ఇంటి పనులకే పరిమితం చేస్తున్నారు. పదో తరగతి పూర్తయితే చదువు అటకెక్కించి అత్తారింటికి పంపిస్తున్నారు. పాఠశాల విద్య వరకు బాలురతో పోటీపడుతున్నా, ఉన్నత చదువులకు అడ్డుపుల్లలు పడుతున్నాయి. తగిన వయసు రాకముందే పెళ్లి చేసి పంపేయడం, మేనరికాలు వంటివి జాతీయ సగటు కంటే తెలంగాణలోనే ఎక్కువ ఉన్నాయి. 'కౌన్సిల్ ఫర్ సోషల్ డెవలప్‌మెంట్' (సీఎస్‌డీ) విడుదల చేసిన తెలంగాణ సామాజిక అభివృద్ధి నివేదిక (సీడీఆర్)- 2018లో ఈ విషయాలు వెల్లడయ్యాయి.

ప్రణాళికా శాఖ సూచన మేరకు పలు అంశాలపై 1991 నుంచి 2016 వరకు గణాంకాలను సరిపోల్చి లోతైన అధ్యయనం చేశారు. సీఎస్‌డీకి చెందిన కల్పనా కన్నబీరాన్, పద్మినీ స్వామినాథన్, జయరాజన్ ఈ



నివేదికను రూపొందించారు. సీఎస్‌డీ అధ్యక్షుడు ముచ్‌కుంద్ దూబే విడుదల చేశారు. దళిత మహిళా సమాఖ్య కన్వీనర్ రూత్ మనోరమ తదితరులు పాల్గొన్నారు.

జీవనశైలి వ్యాధుల కారణంగా మృత్యువాత పడుతున్నవారి సంఖ్య రాష్ట్రంలో ఎక్కువగా నమోదవుతున్నట్లు నివేదిక వెల్లడించింది. సగటు ప్రజలకు వైద్యఖర్చులు భారంగా మారాయని, పురుషుల కంటే మహిళలకయ్యే వైద్య వ్యయం ఎక్కువగా ఉంటోందని, ప్రసవ ఖర్చుల్లో దేశంలోని ఇతర రాష్ట్రాల కంటే తెలంగాణలోనే ఎక్కువగా వసూలు చేస్తున్నారని వివరించింది. మహిళల సాధికారత, భద్రత, ఉన్నత చదువుల కోసం తీసుకోవాల్సిన పలు చర్యల గురించి నివేదికలో కొన్ని సిఫార్సులు చేశారు.

**ముఖ్యాంశాలు:**

- తెలంగాణలో 18 ఏళ్ల వయసులో పెళ్లి చేసుకుంటున్న అమ్మాయిలు 30.8 శాతం కాగా, 21 ఏళ్లకు పెళ్లి చేసుకుంటున్న అబ్బాయిలు 13.4 శాతంగా ఉన్నారు.
- పెళ్లీడు కంటే ముందే దాదాపు 26 శాతం మంది అమ్మాయిలకు పెళ్లిళ్లు జరుగుతుండగా, దాదాపు 18 శాతం మంది అబ్బాయిలకూ అదే జరుగుతోంది.
- మేనరికం వివాహాలు జాతీయ స్థాయి (14 శాతం) కంటే ఇక్కడే అధికం (30 శాతం). ఇందులోనూ తండ్రి తరపు చుట్టరికంతో పెళ్లిళ్లు 12.7 శాతం.
- గ్రామీణ భారతం (రూ.16,956)తో పోల్చితే గ్రామీణ తెలంగాణలో వైద్యసేవల ఖర్చు అధికంగా రూ.21,683 ఉంది.

- గ్రామీణ పురుషుల (రూ. 15,393)తో పోల్చితే ఆరోగ్యానికయ్యే ఖర్చు గ్రామీణ మహిళలకు చాలా ఎక్కువగా (రూ. 28,902) ఉంది.
- ప్రసవానికయ్యే ఖర్చు కూడా ఇక్కడే ఎక్కువగా ఉంది. దేశంలో గ్రామీణంలో ప్రసవానికి రూ. 5,544 ఖర్చవుతుండగా.. పట్టణ ప్రాంతాల్లో రూ. 11,685 అవుతోంది. అదే తెలంగాణలో గ్రామీణంలో రూ. 13,320 ఖర్చవుతుండగా.. పట్టణ ప్రాంతాల్లో రూ. 18,969 ఖర్చవుతోంది.
- రక్తహీనతతో బాధపడుతున్నవారిలో పురుషుల కంటే మహిళలే ఎక్కువ ఉంటున్నారు.
- దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు రాష్ట్రంలో సగటున 5.5 శాతం ఉండగా.. ఇందులో మహిళలు 6 శాతం.
- ఇన్‌ఫెక్షన్ల బారినపడుతున్నవారిలో పురుషుల కంటే మహిళలు ఎక్కువగా ఉన్నారు.
- ఉన్నత విద్య చదువుతున్న మహిళల శాతం తక్కువ. హైదరాబాద్, వరంగల్ మినహా మిగతా జిల్లాల్లో పరిస్థితి ఆశాజనకంగా లేదు.
- ఉమ్మడి ఖమ్మం, నల్గండ జిల్లాల్లో బాలికా విద్యపై వివక్ష కొనసాగుతోంది. ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గండ, రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో డిగ్రీ, ఆపై విద్యలో తక్కువ భాగస్వామ్యం ఉంది.
- ఉచిత పాఠ్యపుస్తకాలు అందుతున్నది కొందరికే. మెదక్, ఖమ్మం తదితర జిల్లాల్లో 50 శాతం మంది బాలికలు మాత్రమే ఉచిత పాఠ్యపుస్తకాలు పొందారు. హైదరాబాద్‌లో మధ్యాహ్న భోజన పథకం 15 శాతం బాలురు, 17 శాతం బాలికలకే అందుతోంది. వాస్తవానికి ప్రభుత్వ పాఠశాలల్లో 36.5 శాతం బాలురు, 43.8 శాతం బాలికలు చదువుతున్నారు.
- స్టెరిలైజేషన్ మహిళల్లో 54.2 శాతం కాగా, పురుషుల్లో కేవలం 1.6 శాతం మాత్రమే. పట్టణ ప్రాంతాల్లో మహిళల స్టెరిలైజేషన్ ఎక్కువ.
- మహిళలపై వేధింపులు, దాడులు పెరిగాయి. 2016లో 1.08 లక్షల కేసులు నమోదు కావడమే దీనికి నిదర్శనం.

**సూచనలు..**

- ఉన్నత విద్యలో ఎస్సీ, ఎస్టీల్లో లింగవివక్ష ఎక్కువగా ఉంది. బాలికలు చదువుకునేందుకు వీలుగా ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలి.
- ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు పొందుపరచాలి.
- బాలికలకు అందుబాటులో ఉండేలా చూడాలి. వీరికి ప్రత్యేకమైన ఉపకార వేతనాలు అందించాలి.
- బాలికలు పాఠశాలలకు సురక్షితంగా చేరుకునేందుకు రాయితీతో ప్రయాణ సదుపాయాలు కల్పించాలి.
- నల్గొండ, మెదక్ జిల్లాల్లో పాఠశాలల్లో చేరని ఎస్సీ, ఎస్టీలను చేర్పించేలా ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టాలి.
- ఉన్నత విద్యను అభ్యసించేందుకు వీలుగా బాలికల కోసం ప్రత్యేక విధానం రూపొందించాలి. ✧

# ఎన్నికల నిఘా 2018లో లోక్‌సత్తా




తెలంగాణలో ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో సాగటానికి 'ఎన్నికల నిఘా–2018' పేరుతో ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్, ఇతర స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసిన వేదికలో లోక్‌సత్తా కూడా భాగస్వామిగా పనిచేస్తోందని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ తెలంగాణ, ఏపీ సమన్వయకర్త బండారు రామ్మోహనరావు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని, ప్రలోభాలకు గురికాకుండా మంచి నాయకుడు, నాయకురాలిని ఎన్నుకోవాలని కృషి చేస్తున్నామన్నారు. లోక్‌సత్తా ఒక పార్టీగా పోటీ చేసిన ప్రతి ఎన్నికలోనూ దీన్ని ఆచరించి చూపిందన్నారు.



# వ్యవసాయంలో రాబడి తెచ్చే విధానాలు లేక తీవ్రంగా కుంగిపోతున్న తెలంగాణ కౌలురైతు

సరైన దిగుబడి రాక.. వచ్చినా తగిన ధర లభించక, బ్యాంకుల నుంచి అవసరమైన రుణాలు అందక, ప్రైవేటు అప్పుల ఒత్తిడికి తట్టుకోలేక బలవన్మరణం పొందుతున్న రైతుల్లో అత్యధికం సన్న, చిన్నకారు రైతులు కాగా, ఇందులోనూ ఎక్కువశాతం కౌలురైతులే ఉంటున్నారని ఇటీవల మరో అధ్యయనం కూడా తేల్చింది. తెలంగాణలో రైతు ఆత్మహత్యలు, కౌలురైతుల కష్టాలు, రైతు బంధు అమలు నేపథ్యంలో గ్రామాల్లో వాస్తవ సాగుదారుల పరిస్థితి తదితర అంశాలపై రైతు స్వరాజ్య వేదిక, హైదరాబాద్‌లోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ విద్యార్థులు, మరికొందరు పరిశోధకులు కలిసి 2018 మే-జూన్‌లో ఈ అధ్యయనం చేశారు.

మొత్తం రైతు ఆత్మహత్యలలో 93 శాతం సన్న, చిన్నకారు, భూమిలేని వారివికాగా, వీరిలో 75.15 శాతం కౌలురైతులే. 81 శాతం మంది పత్తి సాగుచేసి నష్టపోయినవారే. ఆత్మహత్య చేసుకున్న రైతుల్లో బలహీనవర్గాలకు చెందినవారు ఎక్కువగా ఉన్నారని నివేదిక తెలిపింది. గత నాలుగేళ్లలో ఆత్మహత్య చేసుకున్న రైతుల్లో 692 కుటుంబాల గురించి అధ్యయనం చేశామని వెల్లడించింది. పెట్టుబడి సాయం నేపథ్యంలో మూడు జిల్లాల్లోని మూడు గ్రామాలను ఎంచుకుని అధ్యయనం చేసింది. అధ్యయనం చేసిన 692 ఆత్మహత్య కేసుల్లో 520 కౌలురైతులకు సంబంధించినవే. కౌలు రైతుల్లో అత్యధికంగా 64 శాతం మంది రెండున్నర ఎకరాల లోపు ఉన్నవారు కాగా, మరో 30 శాతం మందికి రెండున్నర నుంచి ఐదు ఎకరాల భూమి ఉంది. కౌలు రైతుల ఆత్మహత్యలు కొన్ని జిల్లాల్లో చాలా ఎక్కువగా ఉన్నాయి. గత నాలుగేళ్లలో మంచిర్యాల జిల్లాలో జరిగిన

***కౌలు రైతుల్లో అత్యధికంగా 64 శాతం మంది రెండున్నర ఎకరాల లోపు ఉన్నవారు కాగా, మరో 30 శాతం మందికి రెండున్నర నుంచి ఐదు ఎకరాల భూమి ఉంది. కౌలు రైతుల ఆత్మహత్యలు కొన్ని జిల్లాల్లో చాలా ఎక్కువగా ఉన్నాయి. గత నాలుగేళ్లలో మంచిర్యాల జిల్లాలో జరిగిన ఆత్మహత్యల్లో 95 శాతం మంది కౌలురైతులవే కాగా, నల్గొండ జిల్లాలో 93 శాతం, యాదాద్రి-భువనగిరిలో 87 శాతం, ఆదిలాబాద్ జిల్లాలో 86 శాతం కౌలురైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. భూమి లేకుండా ఆత్మహత్య చేసుకున్నవారంతా కౌలురైతులేనని, జాతీయ క్రైం రికార్డ్స్ బ్యూరో వ్యవసాయ కూలీలను వేరుగా పేర్కొనడం వల్ల ఈ కౌలురైతులు లెక్కల్లోకి ఎక్కడం లేదని నివేదిక పేర్కొంది. ఆత్మహత్య చేసుకున్న కౌలురైతుల్లో చాలామందికి బ్యాంకుల్లో రుణాలు పెద్దగా లేకపోవడంతో వీరంతా ప్రైవేటు అప్పులపైనే ఆధారపడినట్టు స్పష్టమవుతోందని నివేదిక తెలిపింది.***

| ఆత్మహత్య చేసుకున్న కౌలురైతుల కుటుంబాలకు ఉన్న రుణం వివరాలివి.. | | | | |
|---|---|---|---|---|
| భూమి (ఎకరాల్లో) | ఆత్మహత్య చేసుకున్న కౌలురైతులు | సరాసరి బ్యాంకుల్లో ఉన్న రుణం (రూపాయల్లో) | ప్రైవేటు రుణం (రూపాయల్లో) | బ్యాంకు రుణం లేని రైతులు |
| భూమి లేనివారు | 93 | 11,000 | 3,64,000 | 75 |
| 0-1 | 115 | 38,000 | 3,85,000 | 55 |
| 1-2.5 | 198 | 46,000 | 3,85,000 | 67 |
| 2.5-5 | 236 | 66,000 | 4,44,000 | 59 |
| 5-10 | 40 | 1,46,000 | 4,34,000 | 6 |
| 10 ఎకరాల కంటే ఎక్కువ | 6 | 1,40,000 | 4,06,000 | 3 |

ఆత్మహత్యల్లో 95 శాతం మంది కౌలురైతులవే కాగా, నల్గొండ జిల్లాలో 93 శాతం, యాదాద్రి-భువనగిరిలో 87 శాతం, ఆదిలాబాద్ జిల్లాలో 86 శాతం కౌలురైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. భూమి లేకుండా ఆత్మహత్య చేసుకున్నవారంతా కౌలురైతులేనని, జాతీయ క్రైం రికార్డ్స్ బ్యూరో వ్యవసాయ కూలీలను వేరుగా పేర్కొనడం వల్ల ఈ కౌలురైతులు లెక్కల్లోకి ఎక్కడం లేదని నివేదిక పేర్కొంది. ఆత్మహత్య చేసుకున్న కౌలురైతుల్లో చాలామందికి బ్యాంకుల్లో రుణాలు పెద్దగా లేకపోవడంతో వీరంతా ప్రైవేటు అప్పులపైనే ఆధారపడినట్టు స్పష్టమవుతోందని నివేదిక తెలిపింది.

**40 శాతం మంది కౌలుదారులే**

- ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని తీసుకొచ్చిన నేపథ్యంలో భూయజమాను లెవరు.. ఇందులో సాగు దారులు, ఇతర వృత్తుల్లో ఉంటున్నవారు, కౌలుకు చేస్తున్న రైతుల పరిస్థితి ఏంటన్న దానిపై కూడా కొన్ని గ్రామాల్లో అధ్యయనం జరిగింది. భూముల వివరాలను రెవెన్యూ అధికారుల నుంచి తీసుకొని, ఒక్కో గ్రామంలో 50 నుంచి 75 శాతం మంది కౌలురైతులను నేరుగా కలిసి సర్వే చేసినట్టు నివేదిక పేర్కొంది.
- ఉదాహరణకు మంచిర్యాల జిల్లాలోని ఇటిక్యాల గ్రామంలో 947 మంది పట్టాదారులకు 1,904 ఎకరాల భూమి ఉంది. ఈ గ్రామంలో 120 మంది కౌలు రైతులున్నారు. ఇందులో 89 మందిని సర్వే చేస్తే 26 మంది పూర్తిగా భూమి లేనివారని తేలింది. ఇక్కడ మొత్తం వ్యవసాయభూమిలో 37 శాతం కౌలుకు ఇచ్చినట్టు తేలింది. సరాసరి ఎకరాకు కౌలు రూ.10,600. రైతుబంధు కింద ప్రయోజనం పొందినవారిలో చాలామంది దానిని కౌలురైతుకు ఇవ్వడంలేదని, లేదా కౌలు ధరైనా తగ్గించడంలేదని తేలింది. కేవలం తొమ్మిదిమంది భూయజమానులే కౌలుధరను పెంచడం గమనార్హం.
- ప్రతి గ్రామంలోనూ 25 నుంచి 40 శాతం మంది కౌలురైతులే. గ్రామాల్లోని మొత్తం భూమిలో 30 నుంచి 44 శాతం వీరే సాగు చేస్తున్నారు.
- భూ యజమానుల్లో 15.5 శాతం మంది మాత్రమే వ్యవసాయం వృత్తిగా ఉన్నారు. 50 శాతం మంది ఉద్యోగాలు లేదా వ్యాపారాలు చేసుకుంటున్నారు. పది శాతం మంది వృద్ధాప్యంలో ఉన్నారు. ✧

# ఉపప్రణాళిక ప్రచార ప్రణాళికే !

గిరిజనుల జీవనప్రమాణాలను పెంచేందుకు జనాభా దామాషా పద్ధతిన వారికి నిధుల్ని కేటాయిస్తున్నా రూపొందించిన ఎస్టీ ఉపప్రణాళిక లక్ష్యానికి బారెడు దూరంలోనే ఉంది. తెలంగాణలో (ఆంధ్రప్రదేశ్‌లోనూ) గిరిజన ఉపప్రణాళిక అమలు ఇంకా బాల్యదశలోనే ఉందని ఆర్థిక, సామాజిక అధ్యయన కేంద్రం (సెస్) అధ్యయనం వెల్లడించింది. సెస్ ప్రొఫెసర్ ఎం.గోపీనాథ్ రెడ్డి నేతృత్వంలో పల్లా త్రినాథరావు, జి.ఈదయ్యలతో కూడిన బృందం ఈ ఉపప్రణాళిక కేటాయింపులు, అమలు తీరును మదింపుచేసింది. ప్రభుత్వం చెబుతున్న కేటాయింపులు, చేస్తున్న ఖర్చులకు పొంతన లేదని తేల్చింది. గిరిజనుల కోసం ఇన్నిన్ని కోట్లు ఖర్చు చేస్తున్నామంటే ప్రజలు నమ్మరని వ్యాఖ్యానించింది. పథకాల అమల్లోనూ అవకతవకలున్నాయని బైటపెట్టింది. చట్టబద్ధమైన వ్యవస్థతో ఉపప్రణాళిక అమలును సమీక్షించాలని సూచించింది. ఆదాయాన్ని అందించే పథకాలు, వ్యవసాయ కార్యక్రమాల ద్వారా గిరిజనులలో సానుకూలమైన మార్పును తీసుకురావచ్చని పేర్కొంది.

తెలంగాణలో 2014-15లో 35శాఖలకు రూ.3,167 కోట్లు కేటాయించారు. గ్రామీణాభివృద్ధి, నీటిపారుదల, గ్రామీణ నీటిసరఫరా, పాఠశాల విద్య, బలహీనవర్గాల గృహనిర్మాణ శాఖలకు సగానికి పైగా నిధులు కేటాయించామన్నా 32శాతమే ఖర్చు చేశారు. 2015-16లో రూ.3,482.30కోట్లు కేటాయించి రూ.2,070.38 కోట్లే ఖర్చు చేశారు. అది కూడా చాలామేర దారిమళ్లించి.

ఆంధ్రప్రదేశ్‌లో గిరిజనేతర ప్రాంతాలలో రవాణాకు ఎస్టీ నిధుల్ని ఉపయోగించారు. 2014-15లో ప్రభుత్వం 93శాతం ఉపప్రణాళిక నిధుల్ని ఖర్చు చేసినట్టు (మొత్తం కేటాయింపు రూ.911.35కోట్లు) చూపించింది. తర్వాత ఏడాది బడ్జెట్ పెరిగినా ఖర్చు 67శాతానికే పరిమితమైంది. 2015-16లో (కేటాయింపు రూ. 1443.38 కోట్లు) విడదీయలేని మౌలిక సదుపాయాలకు రూ.217.88కోట్లు వెచ్చించినా ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు.

ఉపప్రణాళిక చట్టం అమలు పర్యవేక్షణకు రెండు రాష్ట్రాలూ ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయలేదు. ఏపీలో ఒక్కసారి మినహాయించి, ముఖ్యమంత్రుల ఆధ్వర్యంలో సమావేశాలు లేవు. ఎమ్మెల్యేలు, ఎంపీలు సూచించిన పనులు చేపట్టాలనటం ప్రణాళిక అమలును ప్రశ్నార్థకం చేసింది. ఎస్టీ ఉపప్రణాళిక ఖర్చుపై ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటు చేయలేదు. ఉపప్రణాళిక నిధులపై ఐటీడీఏలో స్పష్టమైన సమాచారమే లేదు. ఉపప్రణాళిక అమలు తర్వాత మానవాభివృద్ధి సూచీలను సమీక్షించేందుకు సామాజిక తనిఖీలు చేపట్టాలి. ఆ జవాబుదారీతనం లోపించింది. ✧




**"ధర్మానికీ, రాజనీతికీ సంబంధం లేదని చెప్పేవారికి ధర్మమంటే ఏమిటో తెలియదని నేను గట్టిగా చెబుతాను"**

**- మహాత్మాగాంధీ**

# అధ్వాన్న ప్రజారవాణాతో హైదరా 'బాధ'!

హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్య ఎంత దుర్భరంగా ఉందో చెప్పనక్కర్లేదు. ఈ సమస్యను తగ్గించాల్సిన ప్రజారవాణా వ్యవస్థ అధ్వాన్నంగా ఉంది. వర్షం పడ్డా, రోడ్డు పాడైనా అంతా తాత్కాలిక ప్రాతిపదికన చర్యలే తప్ప శాశ్వత పరిష్కారాలు లేవు. పలుచోట్ల రోడ్లు ఉదయం బాగు చేస్తుంటే సాయంత్రానికి కరిగిపోతుండగా, కాలం చెల్లిన ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం జనాన్ని జడిపిస్తున్నాయి. మెట్రో రైలు అందుబాటులోకి వచ్చినా జనం బాధలు తప్పటం లేదు.

హైదరాబాద్ మహానగరం తక్షణం ప్రజారవాణాపై దృష్టి పెట్టాలని, లేదంటే భవిష్యత్తులో ఇంకా కష్టాలు తప్పవని లీఅసోసియేట్స్ దక్షిణాసియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అధ్యయనం కూడా ఇటీవల హెచ్చరించింది. 2016 వరకు నగర జనాభా వృద్ధి రేటు ఆధారంగా.. 2041 వరకు వివిధ ప్రాంతాల్లో జనాభా పెరుగుదల, ఉపాధి అవకాశాలు, నిర్మాణరంగం తదితర అంశాలను నివేదికలో వెల్లడించింది.

హైదరాబాద్ మహానగరాభివృద్ధి (హెచ్ఎండీఏ)కు సమర్పించిన లీఅసోసియేట్స్ నివేదికలోని ముఖ్యాంశాలు..

❑ 2016లో ప్రజారవాణా వ్యవస్థ 31 శాతం ఉండగా, 2041 నాటికి 50 శాతం పెరగాల్సిన అవసరం ఉంది.

❑ ప్రజలు స్థానిక రహదారులను ఎక్కువగా వినియోగించుకుంటున్నందున రానున్న 30 ఏళ్లలో స్థానిక రహదారులను గరిష్టస్థాయిలో అభివృద్ధి చేయాలి.

❑ భవిష్యత్తులో అభివృద్ధి అంతా అవుటర్ రింగ్‌రోడ్డు చుట్టూ కేంద్రీకృతం కానున్న నేపథ్యంలో రోడ్డుకిరువైపులా అభివృద్ధి జరిగే ప్రదేశాలను గుర్తిస్తూ వాటికి నగరంలోని ఇతర ప్రదేశాలకు దగ్గర దారులను గుర్తిస్తూ అనుసంధానం చేయాలి. తద్వారా ప్రయాణ సమయాన్ని తగ్గించవచ్చు.

❑ 2026 వరకు పెరగనున్న జనాభా అవసరాలకు అనుగుణంగా రవాణా వ్యవస్థను మెరుగుపరచటానికి ప్రత్యేక రహదారులను గుర్తించాం. అక్కడ బస్ రూట్లను వృత్తాకారంలో చేయటంతోపాటు స్పోక్స్ అండ్ వీల్ విధానాన్ని అవలంబించాలి. ఇంటర్‌సిటీ బస్ టెర్మినల్స్ ఏర్పాటుతోపాటు బేగంపేట నుంచి దుండిగల్ వరకూ వలయాకారంగా బస్ మార్గాలను ఏర్పాటు చేయాలి.



❑ నగరంలో ముఖ్యంగా బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మైత్రీవనం, కూకట్‌పల్లి, మైండ్‌స్పేస్, వనస్థలిపురం ప్రాంతాల్లో జనాభా, వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకుని రహదారులు, రవాణా వ్యవస్థల్ని ఏర్పాటు చేయాలి. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మైత్రీవనంను కోర్ ఏరియాగా గుర్తించాలి. మైండ్‌స్పేస్ అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ప్రాంతం.


❑ కూకట్‌పల్లి, వనస్థలిపురం ప్రాంతాలు నివాస ప్రాంతాలుగా మరింత ప్రాధాన్యతను సంతరించుకోనున్నాయి. ఆయా ప్రాంతాల్లో ప్రజారవాణా వ్యవస్థను 50 నుంచి 70 శాతం వరకు పెంచకపోతే భవిష్యత్తులో తీవ్ర ట్రాఫిక్ సమస్యల్ని ఎదుర్కోవలసి రావచ్చు.

❑ మెరుగైన భవిష్యత్తు రవాణా వ్యవస్థ కోసం అర్బన్ ట్రాన్స్‌పోర్టు అభివృద్ధికి నిధులతోపాటు పీపీపీ భాగస్వామ్యంలో ప్రాజెక్టులను చేపట్టాలి. భూములను లీజుకు ఇవ్వడం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవాలి.

❑ కొత్తగా అభివృద్ధి చేసే ప్రాంతాల్లో డెవలప్‌మెంట్ ఛార్జీలు విధించటం, పబ్లిక్, క్యాపిటల్ మార్కెట్, బాండ్ల ద్వారా నిధులను సమకూర్చుకోవచ్చు. దీర్ఘకాలిక పెట్టుబడులతో హెచ్ఎండీఏ నిధులను సేకరించవచ్చు. ✧

# రాజ్యాంగ వ్యవస్థలను రక్షించుకుందాం

- బండారు రామ్మోహనరావు




స్వాతంత్ర్యానికి ముందు, ఆ తర్వాతా మనదేశంలో అనేక సంస్కరణలు, సామాజిక మార్పులు, చట్టాలు, దూరదృష్టితో తెచ్చిన చట్టాలూ ఉన్నాయి. చాలా రాజ్యాంగబద్ధ వ్యవస్థలు ఏర్పడ్డాయి. బ్రిటిష్ కాలం నాటికే మనకున్న కొన్ని రాజ్యాంగ వ్యవస్థలను అలాగే కాపాడుకుని మనదైన శైలిలో వాటిని తీర్చిదిద్దుకొన్నాం. కానీ నాటి నుండి వ్యక్తి – వ్యవస్థ మధ్య పోరాటం/ అగాథం అలాగే ఉంది. వ్యక్తి మారాలా, వ్యవస్థ మారాలా అన్నది మిలియన్ డాలర్ ప్రశ్నగానే కొనసాగుతోంది. మన దేశానికే కాదు ప్రపంచానికే విలువలు, రాజకీయ, పాలనా మార్పులు, సంస్థల ఏర్పాటుపై స్ఫూర్తినిచ్చిన మన జాతిపిత మహాత్మాగాంధీ, డా॥ బీఆర్ అంబేద్కర్‌లు వ్యక్తి – వ్యవస్థల దృక్పథానికి ప్రతీకలు.

బెల్లం అతిగా తినొద్దని ఒక పిల్లవాడికి చెప్పడానికి తనకు వ్యక్తిగతంగా ఉన్న 'బెల్లం' తినే అలవాటును మార్చుకున్న తర్వాతే నీతి బోధ చేసిన మహాత్మాగాంధీ, వ్యవస్థ మారాలంటే మొదట వ్యక్తి మారాలని అన్నారు. అదే వ్యవస్థాగతమైన ఏర్పాట్లు సరిగ్గా ఉంటే, వ్యక్తి తన అలవాట్లను మార్చుకోవటానికి మొగ్గు చూపుతాడు కాబట్టి.. అంబేద్కర్ వ్యవస్థల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వ్యక్తి – వ్యవస్థ ఈ వాదనలోకి వెళితే చెట్టు ముందా, విత్తు ముందా? అనే ప్రశ్నమన ముందుకు వస్తుంది. ఇది తెగని, ముడివడని వాదన. దీనికి పరిష్కారంగా వ్యక్తి.. వ్యవస్థల నిర్మాణం చేసుకుంటూనే వ్యవస్థల విలువలను సామూహికంగా ఆచరిస్తూ, వ్యవస్థ విలువలను కాపాడాలి అనే సమాధానం వస్తుంది.

మన దేశంలో ట్రాఫిక్ రూల్స్ సరిగా పాటించని వ్యక్తి అదే వేరే అభివృద్ధి చెందిన దేశానికి వెళితే అక్కడ పాటిస్తున్నాడంటే అక్కడి వ్యవస్థల గొప్పతనానికి నిదర్శనం. ఎంతటివారైనా నిబంధనలకు కట్టుబడేలాగా చేయడమే ఆ వ్యవస్థల ప్రత్యేకత. అదే మనిషి 'దేశం' మారితే పాటించే విలువలు దిగజారుడుగా ఉంటాయి.

ఇటీవల సీబీఐ (కేంద్ర దర్యాప్తు సంస్థ)లో అంతర్గత పంచాయతీ కాస్తా, ఇంటి గుట్టు బయటపడినట్లుగా బహిరంగ చర్చకు దారితీసింది. తదనంతర పరిణామాల్లో ఇద్దరు సీబీఐ డైరెక్టర్లను తొలగించామన్నారు. మళ్లీ ఆ తర్వాత.. "అబ్బెబ్బే, వారు సెలవుపై వెళ్లారు" అన్నారు. ఒక సీబీఐ డైరెక్టర్ తనను తొలగించిన విధానం సరిగా లేదని సుప్రీంకోర్టు దాకా వెళ్లారు. ఇది– నడుస్తున్న భారతం. ప్రస్తుతం సీబీఐ

వివాదం బంతి సుప్రీంకోర్టులో ఉంది. అత్యున్నత న్యాయస్థానం గురివింద గింజ తన నలుపెరగదన్నట్లు కొంచెం వెనక్కి వెళితే, అక్కడా అదే జరిగింది. సీనియారిటీ – జూనియారిటీ గొడవ, కేసుల్లో మంచి కేసులు – చెడ్డ కేసులుంటాయా అనే మీమాంస తలెత్తేలా చేసింది. సమానుల్లో ప్రథముడా – ప్రథముల్లో సమానుడు ప్రధాన న్యాయమూర్తి అనేది కూడా వివాదంగా మారింది. సుప్రీంకోర్టు లోపల జరిగే విషయాలపై 'ఆ నలుగురు' న్యాయమూర్తులు మీడియాకు ఎక్కడం మరో సంచలనం. 'టీ' కప్పులో తుఫానులా ఆ వివాదం సమసి పోయిందిగానీ వారు లేవనెత్తిన ప్రశ్నలు అలానే ఉన్నాయి.

రాష్ట్రపతులు, గవర్నర్లే కాదు.. రాజ్యాంగ వ్యవస్థలైన కోర్టులు, ఎన్నికల కమిషన్‌లు, కాగ్, స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన అనేక సంస్థలు, రిజర్వుబ్యాంకు, నేరపరిశోధనా సంస్థలు ఇలా ప్రతిదీ బజారున పడుతున్నాయి. నోట్ల రద్దు విషయంలో ఆర్‌బీఐ పాత్రపై కూడా అనుమానాలున్నాయి.

స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో అధికారంలోకి వచ్చిన తొలి కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ తదితర నాయకత్వం జాతీయోద్యమం నుంచి వచ్చినవారు కావడం వల్ల రాజకీయాల్లో విలువలు కొనసాగాయి. అదేవిధంగా 1947 నుంచి 1967 వరకు దేశవ్యాప్తంగా రాజ్యాంగబద్ధ వ్యవస్థల ఏర్పాటుతోపాటు జాతీయస్థాయిలో అనేక సంస్థలు (ఇన్‌స్టిట్యూషన్లు) ఏర్పడ్డాయి. శాస్త్రసాంకేతిక రంగాల్లో అనేక అంకురార్పణలు జరిగాయి. అందులో భాగంగానే అధికారులూ నిబద్ధతతో పనిచేశారు. రాజకీయ నాయకత్వం తమకున్న నైతిక సాధికారత (మోరల్ అథారిటీ)తో ఆ పనులు చేయించారు.

డెబ్బయ్యవ దశకం నుండి మెల్లమెల్లగా విలువల పతనం– రాజ్యాంగ సంస్థల, వ్యవస్థల 'వలువలను' ఒక్కటొక్కటిగా ఊడదీస్తూనే ఉంది. ఆనాటి ఇందిరాగాంధీ ప్రధానిగా బాధ్యతలు తీసుకున్న నాటి నుండి నేటి ప్రధాని మోదీ వరకూ ఇది నిరంతరాయంగా జరుగుతూనే ఉంది. ప్రజలు మొదట్లో 'అవునా' అని ఆశ్చర్యపోయేవారు. ప్రస్తుతం ఇది మామూలేనని సరిపెట్టుకుంటున్నారు. అలవాటయిపోయి చాలా సందర్భాల్లో మిన్నకుండిపోతున్నారు.

1975లో అప్పటి రాష్ట్రపతి ఫకృద్దీన్ అహ్మద్ ఎమర్జెన్సీ పాలనపై సంతకం చేసి చీకటి రోజుకుల నాందీ పలికిన రోజు నుండి ప్రజాస్వామ్యంలో 'చీకటివెలుగుల సయ్యాట' మొదలైంది. ఆనాటి రాష్ట్రపతి పాత్ర ఎంత వివాదాస్పదమైందో మనకందరికీ తెలుసు. శేషన్ ఎన్నికల కమిషనర్‌గా వచ్చే దాకా, అంతకు ముందు, ఆ తర్వాతా అనే మనం చెప్పుకుంటున్నాం. ఒక ఎన్నికల కమిషనర్ నుండి ముగ్గురు బృందంగా ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేయడంలో రాజకీయ పార్టీల పెద్దల ఆలోచన అందరికీ తెలిసిందే. తమ తాబేదార్లలో ఒకరినైనా నియమించుకునే అవకాశం ఈ రకంగా వచ్చింది. ఒక ఎన్నికల కమిషనరైతే ఏకంగా సమావేశం జరుగుతుండగానే టాయిలెట్‌లోకి వెళ్లి సెల్‌ఫోన్‌లో అక్కడ జరుగుతున్న చర్చల వివరాలను తాను తాబేదారుగా ఉన్న ప్రభుత్వానికి అందించనట్లుగా మనకి తెలుసు. ప్రజల జ్ఞాపకశక్తి (మెమొరీ) తక్కువే కనుక, అవన్నీ మర్చిపోతున్నాం. ఒక రాజకీయ పార్టీలకు ఇప్పటివరకూ, ఏదైనా పెద్ద సంచలనాత్మక నేరం జరిగినా, లేక రాజకీయ వివాదం తలెత్తినా, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అధీనంలోని నేరపరిశోధనా సంస్థల మీద నమ్మకం లేక సీబీఐకి అప్పగించాలనే డిమాండ్ మొదట వచ్చేది. పస లేని, పనికిరాని రాజకీయ ఆరోపణల మీద కూడా.. నాపై సీబీఐ విచారణకు ఆదేశించండి అనో లేక ఎదుటివారిపై సీబీఐ విచారణ జరపాలనో డిమాండ్ చేసేవారు. ఇప్పుడు సీబీఐలో జరుగుతున్న విషయాలను గమనిస్తే ఇక ఆ డిమాండ్ ఉంటుందా అన్న శంకల్లో మునిగి పోయాం. ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో జరుగుతున్న ఆదాయం పన్ను దాడులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ హడావుడులు చూస్తే ఆ వ్యవస్థ విశ్వసనీయత మీద కూడా నీలిమబ్బులు పొడసూపు తున్నాయి. "ఆపరేషన్ గరుడ", జగన్ మీద దాడి, కోడి కత్తి వివాదం ఇవన్నీ సీబీఐ చూడాలేమో. అంటే కంచే చేను మేసినట్లు సీబీఐ పనితీరే ఆరోపణల సుడిగుండంలో చిక్కుకుంది.

ఈ మొత్తం అంతా పరిశీలిస్తే అర్థమయ్యేదేమంటే, ఎవరైనా, ఏ పార్టీ అయినా అధికారంలో ఉంటే రాజ్యాంగ వ్యవస్థలను తమ రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటారని బహిరంగంగా చెప్పుకుంటున్నారు. ఇరుపక్షాలూ, ఇవ్వాళ్ల అధికారంలో ఉన్న పార్టీ, నిన్నటి వరకూ అధికారంలో ఉన్న పార్టీతో సహా విచారణ సంస్థలు తమ తాబేదార్లేనని నిస్సిగ్గుగా అంగీకరిస్తున్నాయి.

### చట్టసభల వైఫల్యం

ఇక చట్టసభలు ఏం చేస్తున్నాయో పరిశీలిస్తే, ప్రజోపకరమైన చట్టాలు

చేయడం, పనికిరాని, అక్కరకు రాని చట్టాలను తొలగించడం చేయాల్సినవారు స్థానిక ప్రభుత్వాల పనితీరులో జోక్యం చేసుకుంటున్నారు. ఢిల్లీలో చేయాల్సిన పనిని 'గల్లీ'లో చేస్తామంటున్నారు.

ఈ సంక్షోభానికి ప్రధాన కారణం దేశంలోని చట్టసభలు, అధికార వ్యవస్థ/ బ్యూరోక్రసీ (ఎగ్జిక్యూటివ్), న్యాయవ్యవస్థ ఒకరు చేయాల్సిన పనులలో మరొకరు జోక్యం చేసుకోవటం కూడా అని చెప్పుకోవచ్చు. విత్తు ఒకటి పెడితే చెట్టు, కాయ మరొకటి రావు కదా! ఎన్నికల్లో కోట్లు ఖర్చు పెట్టి ఎన్నికైనవారు రాజ్యాంగ వ్యవస్థలను తమ గుప్పిట్లో పెట్టుకుని చట్టసభలలో చేయాల్సిన 'చర్చలు' చేయకుండా పైరవీలు చేసుకుంటున్నారు. ఒక వ్యవస్థ మీద మరో వ్యవస్థ పైచేయి కావాలనే తాపత్రయం తప్ప తాము చేయాల్సిన పనిచేయాలనే తపన, ధ్యాస కరువైంది. ఈ సంక్షోభానికి పరిష్కారాలు ఆలోచించాల్సిన పని సమాజానిదే. విజ్ఞత కలిగిన పౌర సమాజం ఆలోచనతోనే దీనికి పరిష్కారం దొరుకుతుంది.

సాగర మథనంలో మొదట హాలాహలం- తర్వాతే అమృతమొచ్చింది.

సంక్షోభం పరిష్కారానికే దారితీయాలి

దేవదానవుల సంగ్రామంలో సాగర మథనంలో మొదట హాలాహలం (విషం) వచ్చి ఆ తర్వాతే అమృత మొచ్చిందంటారు. అదేరకంగా మనదేశంలో రాజ్యాంగ వ్యవస్థల వైఫల్యం అనే సంక్షోభం నుండి- మంచి పరిష్కారాలు వచ్చేటట్లు చేయాలి. ఉదాహరణకు దేశ అత్యున్నత న్యాయస్థానం తనకుతానే ఎక్కువగా ఊహించుకున్న కోర్టుకు హాజరైన ఉన్నతాధికారులు వేసుకున్న 'దుస్తుల' విషయంలో (డ్రెస్‌కోడ్) పట్టించుకున్నదానిలో "పదో"వంతైనా వారు పనిచేస్తున్న సంస్థలలో జరిగే అక్రమాలు, అన్యాయాలను పట్టించుకుని ప్రజలకు న్యాయం చేయొచ్చు. కంచే చేను మేసే విధంగా న్యాయవ్యవస్థలో నియామకాలు, అవినీతి, ఆశ్రిత పక్షపాతంపై వారికివారే విచారణ జరుపుకోవటం వంటి వాటిని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది.

వ్యక్తులు సమాజం నుండే వస్తారు. ఆకాశం నుండి రారు. 'ఏలియన్స్' (గ్రహాంతరవాసులు)లా అంతరిక్షం నుంచి రారు. ఈ సమాజంలోంచే వారివారి కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్ (రహస్య అంతర్గత నివేదిక)లను మెడలో తగలించుకునే వస్తున్నారు. కానీ అంతకుముందు వారి విధి నిర్వహణలో విలువలకు పట్టం కట్టారా, విలువల వలువలు ఊడదీశారా? వారి ప్రజాజీవితం, బహిరంగ వృత్తి జీవితం, పనితీరును అంచనా వేయడానికి సరైన, స్వతంత్ర వ్యవస్థ ఉండాలి. కేంద్ర, రాష్ట్ర మంత్రివర్గాలలో కేవలం చట్టసంస్థల నుండి ఎన్నికైనవారే కాకుండా బయట సమాజం నుంచి విజ్ఞులు, మంచివాదిరు, సమాజానికి పనికివచ్చేవారిని కూడా తీసుకునే వెసులుబాటు కావాలి. ఈవేళ గవర్నర్, రాష్ట్రపతి నియమించే నామినేటెడ్ సభ్యులలాగా కాకుండా, సమాజంలో ఎక్కువమంది గౌరవించే, ఆమోదించే వ్యక్తులను అత్యున్నత రాజ్యాంగ వ్యవస్థల అధిపతులుగా నియమించే వీలు ఉండాలి. నియామక పద్ధతి మరీ సంక్లిష్టం కాకుండా సులువుగా, విలువలకు కట్టుబడేలా ఉండాలి.

**పరిష్కారాలున్నాయ్!**

నిస్పృహ అక్కర్లేదు, నిజమైన పరిష్కారాలున్నాయి.

1) ప్రస్తుతం ఉన్న ఢిల్లీ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్‌ను రద్దు చేసి సీబీఐని దేశంలో ఒక అత్యున్నత నేరపరిశోధనా సంస్థగా పునర్నిర్మాణం చేసేలా పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలి. సీబీఐని లోక్‌పాల్ పరిధిలోకి తేవాలి.

2) న్యాయసంస్కరణలు: సుప్రీంకోర్టు, హైకోర్టు, కిందిస్థాయి న్యాయవ్యవస్థలో న్యాయసంస్కరణలు రావాలి. జాతీయ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్ కమిటీ లాంటివి అవసరం.

3) పోలీసు సంస్కరణలు జరగాలి: నేరపరిశోధనను, సాధారణ పోలీసు విధులను వేరు చేయాలి. నేరపరిశోధనకు అత్యంత సమర్థులైన పోలీసు అధికారులతో స్వతంత్రంగా విచారణ జరిపించే వ్యవస్థ కావాలి. నేర దర్యాప్తు సంస్థ స్వతంత్ర ప్రతిపత్తితో ఉండాలి.

4) తప్పుకు శిక్ష - మంచికి బహుమానం ఉండాలి: నేటి నేరవిచారణలో 'నేర అంగీకారం' (కన్ఫెషన్) లేకుంటే 94 శాతం కేసుల్లో శిక్షలు పడేలా లేవు. కేవలం ఆరు శాతం కేసుల్లో మాత్రమే శిక్షలు పడుతున్నాయి. తప్పు చేస్తే శిక్ష పడుతుందనే భయం, మంచికి బహుమానం లేకున్నా ప్రోత్సాహం ఉండాలి.

5) డబ్బున్నవారికి ఒక న్యాయం లేనివారికి ఇంకో న్యాయం జరగకూడదు. సామాన్యులే జైళ్లలో మగ్గుతున్నారు. పెద్దలు దొరల్లా జల్సాగా బయట తిరుగుతున్నారు. సామాన్య ప్రజలకు న్యాయం జరిగే జవాబుదారీతనం, పారదర్శకతలను న్యాయవ్యవస్థలో పాదుకొల్పాలి.

6) సత్వర న్యాయం - ముంగిటన్యాయం అందాలి: కర్ర ఉన్నవాడిదే బర్రె - బలవంతుడిదే రాజ్యం కాకూడదు. తేలిగ్గా, చవగ్గా న్యాయం అందుబాటులోకి వచ్చేలా సంస్కరణలు జరగాలి. రాజకీయాల్లోకి మంచివారు,

యువత వచ్చే విధంగా అవకాశాలు మెరుగవ్వాలి. రాజకీయం ఒక పవిత్ర వ్యాసంగంగా మారాలి.

7) వ్యవస్థల మీద ప్రజలకు నమ్మకం పెంచాలి.

8) 2జీ స్పెక్ట్రం కేసులో దోషులకు శిక్ష పడకపోవచ్చు. అందులోని నిందితులు కడిగిన ముత్యాల్లా బయట తిరుగుతూ ఉండొచ్చు. కానీ వారి లైసెన్సుల్ని రద్దు చేయటం వల్ల వేలాదికోట్ల రూపాయల లాభం ప్రభుత్వ ఖజానాకు కలిగింది. అదే తీరులో బగ్గు రంగంలో కూడా మార్పులు వచ్చి ప్రభుత్వ ఆదాయం పెరిగింది. ఈ కేసులో ప్రాతిపదికలు సరిగా ఉండటం వల్ల సహజ వనరులకు సంబంధించి ఒక పెద్ద సంక్షోభానికి మేలైన పరిష్కార మార్గం ఏర్పడింది. ఇలాగే మార్పుల్ని విస్తరిస్తూ సంస్కరణలను తెచ్చుకుంటుండాలి.

9) సంక్షోభ సమయాల్లో ప్రజలు వ్యవస్థల వైఫల్యం నుంచి ఎంతోకొంత ఎడ్యుకేట్ అవుతున్నారు. ప్రజల్లో అవగాహన పెంచుతూ రాజకీయ సంస్కరణల్ని తేవటంలో పార్టీలకతీతంగా కృషి కొనసాగుతుండాలి.

10) లోక్‌పాల్ చట్టం వచ్చి ఐదేళ్లవుతున్నా ఇంకా నియామకం చేయలేదు. వెంటనే నియమించాలి. రాజ్యాంగ వ్యవస్థలు.. పార్టీలు, ప్రభుత్వాల పెంపుడు కుక్కలు కాదని గట్టిగా గళాలు వినిపించాలి.

ప్రతి వ్యవస్థలో జవాబుదారీతనం కోసం చెక్స్ అండ్ బ్యాలెన్సెస్ ఉండాలి. ఒక వ్యవస్థపై మరో రాజ్యాంగ వ్యవస్థ నిఘా ఎల్లవేళలా ఉండాలి. సరైన పద్ధతులు పాటిస్తేనే సరైన ఫలితాలు వస్తాయి. వైఫల్యాల నుండి పాఠాలు నేర్చుకొని విజయాన్ని సాధించే ఆత్మస్థయిర్యాన్ని తెచ్చుకోవాలి.

పాలకుల తీరు వల్ల ఇంకా అపరిపక్వంగానే ఉన్న మన ప్రజాస్వామ్యంలోనే పరిపక్వ ఆలోచనలకు తావివ్వాలంటే విషయ పరిజ్ఞానంతో సంఘటితంగా ఉద్యమించే పౌర సమాజానికి బీజం వేయాలి. తెలంగాణ ఎన్నికలను ఒక సదవకాశంగా ఉపయోగించుకోవాలి. ✧

# సాధారణ గురుకుల గిరిజనుల కన్నా వెనుకబాటులో గిరిజన గురుకుల విద్యార్థులు



తెలంగాణ ఏజెన్సీ ప్రాంతాల్లోని పాఠశాలల్లో సరైన వసతులు లేవని, అక్కడ చదువుతున్న గిరిజన విద్యార్థులు వెనుకబడ్డారని ఆర్థిక, సామాజిక అధ్యయన కేంద్రం (సెస్) పేర్కొంది. అత్యధిక గిరిజన విద్యార్థులు గణితం పాఠ్యాంశాన్ని అత్యంత కఠినంగా భావిస్తున్నట్టు తెలిపింది. సాధారణ గురుకులాల్లోని గిరిజన విద్యార్థుల ఫలితాలతో పోలిస్తే.. గిరిజన గురుకులాల్లో పరిస్థితి దారుణంగా ఉందని స్పష్టం చేసింది. తెలంగాణలో మైదాన, ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే వారితోపాటు ఇతర గిరిజన జాతుల అభివృద్ధికి కృషి జరగాలని, వారి మధ్య అసమానతలు తగ్గించేందుకు జనాభా ఆధారంగా కాకుండా.. వారి అభివృద్ధి సూచికలు పెరిగేలా ప్రత్యేక నిధులు కేటాయించాల్సిన అవసరముందని సూచించింది. గిరిజనుల భూములను సాగులోకి తీసుకురావడం ద్వారా వారి జీవనోపాధికి మార్గం చూపాలని చెప్పింది. తెలంగాణలోని ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల్లోని అసహాయ గిరిజన సమూహాల (పీవీటీజీ) సామాజిక ఆర్థిక స్థితి, ప్రభుత్వ-గురుకుల పాఠశాలల్లో గిరిజనుల విద్యపై సెస్ ప్రత్యేక అధ్యయనం చేసింది. "ఇతర గిరిజన జాతులతో పోలిస్తే అసహాయ గిరిజన సమూహాల విద్యార్థుల సగటు మార్కులు తక్కువగా ఉంటున్నాయి. గణితం, ఇంగ్లీషులలో కనీసం పది శాతం మార్కులు సాధించటం లేదు" అని సెస్ నివేదికను ఇటీవల గిరిజన ప్రత్యేక అభివృద్ధి నిధి సమావేశంలో ప్రవేశపెడుతూ అధికారులు అన్నారు.

గిరిజన కుటుంబాల్లో 13 శాతం మందికి మాత్రమే మరుగుదొడ్డి సౌకర్యం ఉందని, విద్యుత్ సౌకర్యం 48 శాతం, ఎల్‌పీజీ కనెక్షన్లు 12 శాతం ఉండగా, ఆధార్ నెంబర్లు, బ్యాంకు ఖాతాలు 89 శాతం, 54 శాతం ఉన్నాయని అధ్యయనం తెలిపింది.

# జేపీ దృష్టికి పలు సమస్యలు



రాయదుర్గం పట్టణంలో తక్షణం చేపట్టాల్సిన పలు కార్యక్రమాలను పార్టీ వ్యవస్థాపకుడు డా॥ జేపీ దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేయాల్సిందిగా కోరినట్టు లోక్‌సత్తా పార్టీ రాయదుర్గం అధ్యక్షుడు బి. వెంకటరమణబాబు తెలిపారు. రాయదుర్గం, అనంతపురం సమస్యలపై, రాయలసీమకు అందాల్సిన ప్రత్యేక సాయంపై జేపీతో 45 నిమిషాల పాటు హైదరాబాద్ కార్యాలయంలో ఆయన చర్చించారు. రాష్ట్ర విభజన పాలకుల తీరు వల్ల ఒక అవకాశంగా కాకుండా సమస్యగా మారిందన్నారు. మళ్లీ ఎన్నికలు వచ్చేస్తున్నా స్థానిక సమస్యలు, ఉమ్మడి రాష్ట్రం కాలం నాటి నుంచి ఉన్న సమస్యలు యధాతథంగా కొనసాగుతున్నాయన్నారు. రాయదుర్గంలోని ప్రతి వార్డుకు రోడ్లు, డ్రైనేజీ కోసం రూ. 3 కోట్ల నిధుల మంజూరుకు ప్రణాళికల్ని, అవినీతిపరులపై చర్యలు లేకుండా కొనసాగిస్తున్న వైనాన్ని జేపీకి వివరించామని, వాటిని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిందిగా కోరామని తెలిపారు. స్థానిక సమస్యలపై రాజధానుల్లో మాట్లాడుకోవాల్సి రావటం దురదృష్టకరమని, అధికార వికేంద్రీకరణను వచ్చే ఎన్నికల్లోనైనా ప్రధాన ఎజెండాగా మార్చాలని జేపీ సూచించారన్నారు.

## వేరుసెనగ రైతుని ఆదుకోవాలి

అనంతవురం జిల్లాలో ఏటా వేరుసెనగ రైతులు అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నా, ప్రభుత్వాలు పట్టించుకోవటం లేదని వెంకట రమణబాబు అన్నారు. గుమ్మఘట్ట మండలంలోని ఎస్.హోసల్లి గ్రామ సమీపం లోని వేరుసెనగ పంట పొలాల్ని ఆయన పరిశీలించారు. ఈ ఏడాది కూడా సకాలం లో వర్షాలు పడక పంట ఎండిపోయిందని, దీంతో అప్పులు మరింత పెరిగి వలసబాట పట్టాల్సి వస్తోందని రైతులు బసవరాజు, నాగరాజు, మల్లికార్జున, చంద్ర తదితరులు వెల్లడించారు. పంట పండినా, ఎండినా రైతుకు లాభంలేని విధానాలను అనుసరిస్తుండటం వల్లే వ్యవసాయ ఒడిదుడుకులను కర్షకులు తట్టుకోలేక పోతున్నారని బాబు అన్నారు. రైతుకు నాణ్యమైన విత్తనాలు, తక్కువ వడ్డీ పరపతిని అందుబాటులోకి తేవటంతోపాటు ధరల స్థిరీకరణకు పెద్ద మొత్తంతో నిధిని ఏర్పాటు చేయాలన్నారు. రైతు రుణమాఫీ విఫల ప్రయోగమనటానికి అనంతపురంలోని తాజా పరిస్థితులే నిదర్శనమన్నారు. వేరుసెనగ రైతులకు తక్షణ సాయం అందించటంతోపాటు భూగర్భ జలాల పెంపునకు, గిట్టుబాటు ధరలకు చర్యలు చేపట్టాలన్నారు. లోక్‌సత్తా పార్టీ నేతలు చంద్ర, హుస్సేన్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి నిర్మూలనే ఇంకా ప్రజల ప్రాధాన్యాంశం

రాజకీయ, ఆర్థిక అవినీతి, నిరుద్యోగం, నేరాలు–హింస, పేదరికం–అసమానతలు, పన్నులు, ఉగ్రవాదం, విద్యలో వైఫల్యం.. భారతీయులను ఎక్కువగా కలవరపరుస్తున్న విషయాలని ఇటీవల ఓ ఆంగ్లపత్రిక ఆన్‌లైన్‌లో చేసిన మినీ సర్వేలో అత్యధికులు అభిప్రాయపడ్డారు. వీటిలో అసమానతలు, పన్నులు, ఉగ్రవాదం, విద్య పట్ల జనాందోళన గతంలో కంటే పెరిగింది. ప్రభుత్వాల పట్ల వ్యతిరేకత కూడా గతంలో కంటే ఒకింత ఎక్కువయింది.

# చెరకు రైతు బకాయిలు చెల్లించండి



విజయనగరం జిల్లాలో రైతు పరిస్థితి మరీ అధ్వాన్నంగా తయారైందని, ఎన్.సి.ఎస్ పంచదార ఫ్యాక్టరీకి చెరకు సరఫరా చేసిన రైతులకు బకాయిలు ఇప్పటిదాకా చెల్లించకుండా వేధిస్తున్నారని లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు, బాధిత రైతులతో కలిసి గ్రీవెన్స్‌డేన కలెక్టరేట్‌లో దీనిపై ఫిర్యాదు చేశారు. 2017-18 సంవత్సరానికి ఎన్‌సిఎస్ రూ.13 కోట్ల బకాయిలు చెల్లించకపోవటం వల్ల పలువురు రైతులు రోజువారీ ఖర్చులకు కూడా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రైవేటు వ్యక్తుల వద్ద అధికవడ్డీకి అప్పులు తెచ్చుకుంటున్నారన్నారు. సమస్యను ఇలాగే నానిస్తే ఆందోళనలకు దిగటం తప్ప మార్గముండదన్నారు. రైతుల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని, అవసరమైతే వేలం వేసైనా బకాయిలు చెల్లించేలా ఆదేశాలివ్వమని ప్రభుత్వాన్ని కోరామని జేసీ వెంకటరమణారెడ్డి హామీ ఇచ్చారు.

# తాగునీరు అందించలేని పాలకవర్గం అవసరమా?





విజయనగరం మునిసిపాలిటీలో పాలకుల అసమర్థత వల్ల ప్రజలు తాగునీరు అనే కనీస సౌకర్యానికి కూడా అనేక కష్టాలు పడాల్సి వస్తోందని, ప్రజల సమస్యలు పట్టించుకునేవారే కరువయ్యారని, అందుకే అన్ని రాజకీయ పార్టీలూ ఒకే వేదికపైకి వచ్చి పాలక నేతల తీరుని ఎండగట్టాల్సి వస్తోందని లోక్‌సత్తా పార్టీ పట్టణ అధ్యక్షుడు మొల్లేటి చిన్నారావు (నాయుడు) అన్నారు.

లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో 'విజయనగరం మునిసిపాలిటీ తీరుతెన్నులు-ప్రజల సమస్యలు'పై అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. లోక్‌సత్తా, బీఎస్పీ, కాంగ్రెస్, జనసేన, బీజేపీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పట్టణంలోని ప్రజలు తాగునీటి కోసం అల్లాడిపోతున్నారని, అది కూడా పరిష్కరించలేని పాలకవర్గం అవసరమా అని చిన్నారావు అన్నారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు డా॥ పీవీ రమణ మాట్లాడుతూ, అధికారంలో ఉండి కూడా సాధారణ అవసరాల్ని తీర్చలేని తెలుగుదేశం నాయకుల తీరు చూసి ప్రజలు సిగ్గుపడుతున్నారన్నారు. పత్రికల్లో ప్రచారం కోసం ఛైర్మన్ పాకులాడుతున్నారని ఎద్దేవా చేశారు. మంచినీటి కోసం కనీసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేకపోయారన్నారు. కాంగ్రెస్ నాయకుడు భుంగ భానుమూర్తి మాట్లాడుతూ, మునిసిపాలిటీలో ఎస్.సి, ఎస్.టి సబ్‌ప్లాన్ నిధుల దుర్వినియోగం జరిగిందన్నారు. పాలనలో లోపాలు ఎండగట్టకపోతే ప్రమాదమన్నారు. ప్రజలు ఎందుకు అధికారమిచ్చారో తెలియని పాలన మునిసిపాలిటీలో కొనసాగుతోందన్నారు. పట్టణంలో పందులు, కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయని అయినా అధికారులకు, నేతలకు ఏమీ పట్టడం లేదని జనసేన నాయకుడు త్యాడా రామకృష్ణ (బాలూ) అన్నారు. బీజేపీ నేత పి.సంతోష్ కుమార్, హృషీకేశం మాష్టారు, గురునాథం, బూడి సన్యాశినాయుడు, పీఎల్‌ఎన్ రాజు, పెంటబాబు, చిన్నారావు, పతివాడ చంద్రరావు, పోలుపర్తి అప్పారావు, నియోజకవర్గం అధ్యక్షుడు నాగభూషణం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం మునిసిపాలిటీపై కరపత్రాలు విడుదల చేశారు.

అందరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సమావేశం విజ్ఞప్తి చేసింది. ఓటు నమోదు, సద్వినియోగంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని పార్టీల నేతలు నిర్ణయించారు.

# చనిపోయాక రూ.2లక్షలివ్వటం కాదు.. రైతులు బతికి సంపాదించుకునే విధానాలను అమలు చేయండి

ప్రభుత్వాలు రైతులకు ఏమీ చేయకపోయినా ఫర్వాలేదని, వారికి ఆదాయమొచ్చే మార్గాలకు గండికొట్టకుండా ఉంటే చాలని జేపీ అన్నారు. ప్రకృతి శాపం వల్ల కాకుండా.. పాలకుల పాపం వల్లే రైతులు నష్టపోతున్నారన్నారు.

కర్నూలు మార్కెట్ యార్డులో సురాజ్య యాత్ర కార్యక్రమంలో పాల్గొన్న జేపీ.. రైతులతో మాట్లాడి కష్టసుఖాలను తెలుసుకున్నారు. వారి ఆదాయం పెంచే మార్గాలపై చర్చించారు.

కల్లూరు మండలం బస్తిపాడుకు చెందిన దస్తగిరి అనే రైతు ఆముదాలను విక్రయానికి మార్కెట్ యార్డుకు తెచ్చాడు. ధర ఎంత వచ్చిందని జేపీ ఆయన్ను అడిగారు. తనకు పెట్టుబడి ఖర్చు కూడా రాదని, ప్రభుత్వం గిట్టుబాటు ధరకూడా ఇవ్వడం లేదని తెలిపారు. క్వింటాకు రూ. 2,500 కూడా రావటం లేదన్నారు.

అలాగే గుత్తికి చెందిన కురువ లక్ష్మన్న తాను 6 ఎకరాల్లో వేరుసెనగ పంట సాగు చేస్తే 24 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని, క్వింటాకు రూ. 3,000 చొప్పున రూ. 70,000 చేతికొచ్చిందని, కానీ పెట్టుబడి ఖర్చు మాత్రం రూ.లక్ష దాటిందని జేపీ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు.

ఉల్లికి ప్రస్తుతం ధర బాగున్నా వర్షాలకు పంటంతా దెబ్బతిన్నది కోడుమూరు, డోన్, గోనెగండ్ల రైతులు జేపీకి తెలిపారు.

అనంతరం జేపీ మాట్లాడుతూ, రుణమాఫీ పొందిన రైతులు కూడా అధిక వడ్డీకి అప్పులు తీసుకోవటం మార్కెట్ యార్డులో చూశానన్నారు. అలా అప్పులు తీసుకున్న రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో అయినకాడికి పంటలను తెగనమ్ముకుంటున్నారన్నారు. బ్యాంకులు రైతులకు రుణాలివ్వటం లేదన్నారు. కౌలురైతుల పరిస్థితి మరీ దయనీయంగా ఉందన్నారు. చివరికి రుణమాఫీ వల్ల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పాలకులు సాధించిందేమిటో అర్థంకావటం లేదన్నారు. రైతులు జనాభాలో 50-60శాతం ఉంటే, వారికి వచ్చే ఆదాయం మొత్తం జాతీయాదాయంలో కేవలం 14శాతం ఉందన్నారు. 85శాతం ఆదాయాన్ని 40శాతం మంది పంచుకుంటుంటే.. కేవలం 14-15శాతం ఆదాయంతో రైతులు బతుకులీడుస్తున్నారన్నారు. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా కూడా పాలకులు రైతులకు రేట్లు వచ్చే



అవకాశాలకు గండికొట్టేలా విధానాలను అమలు చేస్తున్నారన్నారు. గత మూడేళ్లలోనే కేంద్ర ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల ఎగుమతులు ఏటా రూ. 70,000 కోట్లు తగ్గి, పప్పుధాన్యాలు, వంటనూనెల దిగుమతులు మరో రూ. 70,000కోట్ల మేర పెరిగాయన్నారు. ఈ రకంగా 2014 నుంచి ఇప్పటిదాకా రైతులకు రూ. 4,00,000కోట్లకు పైగా నష్టం వాటిల్లిందన్నారు. రైతులు మరణించాక రూ. 2లక్షలు నష్టపరిహారం చెల్లించి ప్రయోజనం లేదని, వారు బతికుండగా ఆదాయాన్ని పొంది ఎదిగే అవకాశాలను కల్పిస్తే దేశానికి ఇబ్బడిముబ్బడి ఆహారధాన్యాలను అందిస్తారని అన్నారు. రుణమాఫీలు, రైతేరాజు, గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలు వంటి నినాదాలతో మోసం చేయకుండా ఇకనైనా రైతుకు ఆదాయం చుట్టూ వ్యవసాయ విధానాలను రూపొందించాలన్నారు. నిల్వ సదుపాయాలు, ప్లెడ్జి రుణాలకు పక్కా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ రకమైన నూతన వ్యవసాయ విధానాలను రూపొందించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమగ్రంగా అందిస్తామన్నారు.

వ్యవసాయంలో ఆదాయంతోపాటు విద్య, ఆరోగ్య రంగాలను కూడా బాగు చేసి అందరికీ నాణ్యతతో అందిస్తే రైతు బిడ్డలకు, కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని జేపీ అన్నారు. లంచాల్లేని సేవలను అందించేందుకు ప్రభుత్వ కార్యాలయాల్లో పౌర సేవల చట్టాన్ని అమలు చేస్తే.. రైతులకు ఎంతో రిలీఫ్ కలుగుతుందన్నారు. ఇవేవీ చేయకుండా ప్రభుత్వాలు చేస్తున్న వాగ్దానాలను చూసి మోసపోవద్దని, కాస్త ఆలోచనతో వ్యవహరించాలని రైతులకు జేపీ విజ్ఞప్తి చేశారు. ఇందుకోసమే సురాజ్య యాత్రను నిర్వహిస్తున్నామన్నారు. రైతులు, రైతు బిడ్డలు యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌లలో తమ మొబైల్ ఫోన్ల ద్వారా నమోదైతే లోక్‌సత్తా నిరంతరం తన వంతు తోడ్పాటును నేరుగా అందిస్తుందన్నారు.

మార్కెట్ యార్డు కార్యదర్శి శాస్త్రి, శివరామకృష్ణ, రామకృష్ణారెడ్డి, రంజిత్‌కుమార్ డేవిడ్, లోక్‌సత్తా నేతలు బందారు రామ్మోహనరావు, భీశెట్టి బాబ్జీ, టి. రాజ్యలక్ష్మి, వైబీఐ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ✧

# (మీడియాలో) 'కీ' కామెంట్లు!

- రాజకీయ నాయకుల బాధ్యతలు ఎన్నికల వరకే అన్నట్టుంది. "ఇండియా మారాలి అంటే అసలు ఓటింగ్ రద్దు చేయాలి'.. అన్నట్టుగా రాజకీయ వ్యవస్థ మారింది. 'గత పాలనాకాలంలో మీరు ఏమి చేశారు' అని ఓటర్లు అడగాలి.

– పద్మనాభయ్య, మాజీ గవర్నర్, కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి

- ఆధునిక రాజ్యవ్యవస్థ అంటే.. రోడ్డు ప్రయాణం నుంచి ఆరోగ్యం, రియల్ ఎస్టేట్ దాకా ఏ రంగంలోనైనా ప్రమాదాల్ని ముందుగానే పసిగట్టి నిర్వీర్యం చేయాలి. ప్రజలు బలిపశువులు కాకుండా కాపాడాలి. కానీ ఆధునికతను సంతరించుకోకుండా ఇంకా బూజు పట్టిన ఆలోచనల్లోనే కొనసాగుతున్న రాజ్యవ్యవస్థలో ప్రమాద హెచ్చరికలు చేసే వాళ్లు ఒంటరి యోధుల్లానే పోరాడాల్సి ఉంటుంది, ఎగతాళికి కూడా గురికావాల్సి ఉంటుంది. జనం సినిమాని ఎంజాయ్ చేస్తున్నప్పుడు.. అగ్నిప్రమాదం అంటూ అరవటం లాంటిదే అది.

- దీపాంకర్ గుప్తా

- తెలంగాణలో ధనప్రవాహం అధికంగా కనిపిస్తోంది. నిర్దిష్టంగా కేసులు నమోదు చేయండి.

- కేంద్ర ఎన్నికల కమిషన్

- కేసీఆర్ ప్రభుత్వం చేసిన మరో పెద్ద మోసం దాదాపు కోటిన్నరకు పైగా ఉన్న అసంఘటిత కార్మికులకు సంబంధించినది. 2008 అసంఘటిత రంగ కార్మికుల సామాజిక భద్రతా చట్టం ప్రకారం సంక్షేమ కార్యక్రమాలు చేపట్టకుండా, తన సొంత పేర్లతో కొన్ని అరకొర పథకాలు తెచ్చి అవి తన సొంత మేధోశక్తి నుండి ఉద్భవించిన పథకాలుగా పాలకులు చెప్పుకుంటున్నారు. ఈ ప్రభుత్వం దశలవారీగా ప్రకటించిన కళ్యాణమస్తు, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్లు, గర్భిణీ మహిళలకు నగదు సహాయం, ఆడపిల్లలకు సహాయం, చివరకు రైతు బీమా.. అన్నీ కూడా ఆ చట్టం ప్రకారం 2014 నుండి అమలు చేయాల్సిన పథకాలే.

- రవికుమార్, న్యాయవాది

- పేదరిక నిర్మూలనకు, సమానావకాశాల సాధనకు మేలైన విద్య తొలి మెట్టు. కానీ సింగపూర్ ఉపప్రధాని ఆమధ్య హెచ్చరించినట్టు.. భారతదేశంలో నేడు పాఠశాలలు తీవ్ర సంక్షోభంలో ఉన్నాయి. భారత్, తూర్పు ఆసియా దేశాల మధ్య అభివృద్ధిలో తేడా ఉందంటే అది పాఠశాల స్థాయిలోని తేడా వల్ల వచ్చిందే. మన దేశంలో నవతరం సంపద పునఃపంపిణీ కన్నా సమాన అవకాశాలనే కోరుకొంటోంది. భారతదేశం యువజనాధిక్యత వల్ల లబ్ధి పొందాలంటే నైపుణ్య శిక్షణను విస్తరించాలి. బ్రిటన్ కార్మిక బలగంలో 68 శాతానికి నైపుణ్య శిక్షణ లభిస్తుంటే జర్మనీలో 75 శాతానికి, అమెరికాలో 52 శాతం, జపాన్‌లో 80 శాతం, దక్షిణ కొరియాలో 96 శాతానికి ఆ శిక్షణ లభిస్తోంది. భారత్‌లో ఇది కేవలం 2.3 శాతమేనంటే- నైపుణ్య సాధనలో మనమెక్కడ ఉన్నామో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వం చేపట్టిన స్కిల్ ఇండియా పథకం మందగతిన సాగుతోంది. ఈ పథకాన్ని కొత్తరకంగా అమలు చేసి ఆశించిన ఫలితాలు సాధించాలి.

-ఎస్.మహేంద్రదేవ్, ఇందిరాగాంధీ అభివృద్ధి పరిశోధన సంస్థ డైరెక్టర్, వైస్ ఛాన్సలర్

■ ఇక్కడ మూడు ప్రాథమిక అంశాలున్నాయి. విద్య, ఆరోగ్యం, ఆధ్యాత్మికత.. ఇవి వ్యాపారాత్మకం కాకూడదు. కనీస వ్యయానికైనా అందించాలి. ఈ మూడూ సమాజ స్వభావాన్ని నిర్దేశిస్తాయి. ఈ మూడూ వాణిజ్యపరం అయినప్పుడు ఆ సమాజం అధోగతి పాలైనట్టే. సమాజం అన్నాక భిన్నమైన మనస్తత్వాలు ఉన్న మనుషులు ఉంటారు. అందరికీ సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. కానీ, మనం ఏం చేస్తున్నామో, ఎందుకు చేస్తున్నామో స్పష్టత ఉండాలి. స్పష్టత కొరవడితేనే అసలు సమస్యంతా! యవ్వనంలో ఉన్నప్పుడు శక్తి ఉన్నతస్థాయిలో ఉంటుంది. కానీ ఆలోచనల్లో స్పష్టత, సమతౌల్యం ఉండవు. వాటిని మనం తీసుకురాగలిగితే, యువత తమ శక్తిని విభిన్న మార్గాల్లో ఉపయోగించే వీలుంది. ముఖ్యంగా సమతౌల్యం లోపిస్తే తెలివితేటలు కొరగాకుండా పోతాయి. అందుకే యువతను నేరుగా లేదా సామాజిక మాధ్యమాల ద్వారా కలుసుకోవాలని నిర్ణయించుకున్నాను.

– సద్గురు జగ్గీ వాసుదేవ్

■ *మన ఫీజు రీఇంబర్స్‌మెంట్ లాంటి పాలసీ మరే దేశంలో లేదు, ఉండకూడదు కూడా. దానివలన రాష్ట్ర ప్రభుత్వంపై లెక్కలేనంత భారం పడుతోంది. మనం అందివ్వాల్సింది నాణ్యమైన విద్యగాని, ఎందుకూ కొరగాని విద్య కాదు. ప్రైమరీ స్కూలు విద్య ఉచితంగా ఇవ్వడంలో అర్థముంది కాని హయ్యర్ ఎడ్యుకేషన్ విద్య కూడా ఉచితంగా ఇవ్వడంలో అర్థం లేదు. ఉన్నత విద్యకు బ్యాంకుల ద్వారా 'బీదవారికి మాత్రమే' రుణాలు ఇప్పించే ఏర్పాటు చేయాలి.*

*– డాక్టర్ వెల్చాల కొండలరావు*

■ తిత్లీ తుఫాను సహాయంలో ప్రభుత్వంకన్నా స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులే ఎక్కువ అండగా నిలబడ్డారని శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రజలు చెపుతున్నారు. విపత్తు సంభవించిన ప్రాంతాల్లోకి ప్రభుత్వమే కదిలి వెళ్లాలన్న ఆలోచన మంచిదే. కానీ పటాటోపాల రాజకీయ వ్యవస్థలో పెద్దల రాక ఊరికి బరువు తప్ప ఓదార్పు కాదు. తెగబారెడు కాన్వాయ్‌లో వచ్చి, సుడిగాలి పర్యటనలు చేసినవారి వల్లనే సాయం ఆలస్యం అయిందనేది ప్రజల వాదన. స్థానికంగా పనిచేయాల్సిన అధికారులు, ఉద్యోగులు, వచ్చీపోయే గొప్పవారి ప్రొటోకాల్ కోసం పరుగులు తీయడంలోనే మునిగిపోవాల్సి వచ్చింది.

– కె.ఎన్ మల్లీశ్వరి, ప్రజాస్వామ్య రచయిత్రుల వేదిక జాతీయ కార్యదర్శి

■ *ప్రఖ్యాత శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్‌లానే 'దేవుడు' అనే పదాన్ని మనిషి రూపానికి ఆపాదించను. ప్రకృతి ధర్మాల ప్రకారం.. ప్రతి అంశానికీ శాస్త్రీయ కోణంలో వివరణ ఇవ్వడమే మేథో దైవత్వం. నా అంచనాల ప్రకారం ఈ శతాబ్దం చివరినాటికి మేథో దైవత్వం గురించి మనం పూర్తిగా తెలుసుకుంటాం.*

*– స్టీఫెన్ హాకింగ్ ('బ్రీఫ్ ఆన్సర్స్ టు ద బిగ్ క్వశ్చన్స్' పుస్తకంలో), ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త*

■ *జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ కుమార్ దోవల్ నాయకత్వంలోని దేశ భద్రతా విధాన నిర్ణయ గ్రూపు (ఎస్పీజీ) కొత్త రూపు సంతరించుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ ఓ నోటిఫికేషన్ ద్వారా హడావుడిగా ఇంతటి మార్పునకు కారణమయ్యారు. కొత్త నోటిఫికేషన్ ప్రకారం ఎస్పీజీ సమావేశానికి ఏ ఇతర మంత్రిత్వశాఖ కార్యదర్శులనైనా రమ్మని ఆదేశించే అధికారం ఎన్ఎస్ఏకు ఉంటుంది. ఇలాంటి విచిత్రమైన మార్పుల వల్ల అత్యంత సున్నితమైన రంగంలో అతి తెలివి ప్రదర్శించడానికి ప్రయత్నించినట్టు కనిపిస్తోంది. ఇందిరాగాంధీ హయాంలో ఇదే జరిగింది. అయితే, అధికార కేంద్రీకరణ లాంఛనంగా, వ్యవస్థీకృతంగా ఇప్పుడు జరుగుతోంది. ఇక అడ్డగోలు నిర్ణయాలకు అడ్డుకట్టవేసే వ్యవస్థ ఉండదు. ఒక వ్యక్తి.. ఏ వ్యక్తి అయినా సరే 1.34 బిలియన్లమంది ప్రజలున్న, అణ్వాయుధ సమేతమైన దేశంలో అత్యంత శక్తిమంతుడు కావచ్చునా అనేది మంచిప్రశ్నగా ఉంటుంది.*

*– శేఖర్ గుప్తా, ద ప్రింట్ ఛైర్మన్, ఎడిటర్-ఇన్-చీఫ్*

**(కర్టెసీ: ఈనాడు, సాక్షి, ఆంధ్రజ్యోతి, టైమ్స్ ఆఫ్ ఇండియా, సోషల్ మీడియా)**

# అవినీతిపై యువత తెలివిగా పోరాడాలి




సరైన పద్ధతులు, యువత నిరంతర నిఘా ఉంటే భారతదేశంలో అవినీతిని పూర్తిగా నియంత్రించవచ్చని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. మనదేశంలోని ప్రజలు నిజాయతీలో ప్రపంచంలో ఎవరికీ తీసిపోరని, ఆ నిజాయతీకి ప్రోత్సాహాన్నిచ్చే పద్ధతులు కొరవడటం వల్లే.. అవినీతి మామూలే అనే నిస్పృహకు లోనవుతున్నారన్నారు.



హైదరాబాద్‌లో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఐ.జి మింట్, జీఎస్‌టీ నిర్వహించిన 'విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్-2018' కార్యక్రమాల్లో జేపీ పాల్గన్నారు.

'అవినీతి నిర్మూలన – నవభారత నిర్మాణం'పై మింట్ కార్యక్రమంలో జేపీ మాట్లాడుతూ.. అవినీతిని అంతం చేయకపోతే, దేశంలో పేదరికాన్ని పారదోలటం, దేశాన్ని ప్రపంచస్థాయికి తీసుకెళ్లటం సాధ్యం కాదని స్పష్టం చేశారు. అవినీతిపై పాలకుల ఎంత పేలవంగా వ్యవహరిస్తున్నారో సీబీఐలో చోటు చేసుకున్న తాజా పరిణామాలే తెలియజేస్తున్నాయన్నారు. అవినీతి పోవటానికి చాలా చేస్తున్నట్టు నటిస్తూ, సరైన విధానాలను అనుసరించకపోవటం వల్లే ఈ దుస్థితి కొనసాగుతోందన్నారు. సీబీఐకి, రాష్ట్రాల్లో ఏసీబీలకు జవాబుదారీతనంతో కూడిన స్వతంత్ర ప్రతిపత్తి కల్పించాలని, దిగువ స్థాయిలో ప్రజలను పీడించే రోజువారీ అవినీతిని రూపుమాపటానికి 'పౌర సేవల' చట్టాన్ని తీసుకురావాలని అన్నారు.

పౌర సేవల చట్టంతో సర్కారీ ఆఫీసుల్లో ప్రతి పనికీ నిర్దిష్ట కాలపరిమితి ఉంటుందని, గడువులోగా చేయలేకపోతే రోజువారీ పరిహారాన్ని దరఖాస్తుదారుకుల చెల్లించాల్సి ఉంటుందని జేపీ అన్నారు. పార్లమెంటు స్థాయీ సంఘం అభ్యర్థన మేరకు లోక్‌సత్తా రూపొందించి ఇచ్చిన పౌర సేవల బిల్లు పార్లమెంటు ముందు ఉన్నా ప్రభుత్వం పట్టించుకోలేదని, పైగా అవినీతికి పాల్పడిన ప్రభుత్వాధికారులపై విచారణ చేపట్టాలన్నా పైనుంచి అనుమతి కావాలని, గతి లేక లంచం ఇచ్చే ప్రజలకు మాత్రం కనిష్టంగా 3 ఏళ్లు, గరిష్టంగా 7 ఏళ్ల జైలు శిక్ష విధించాలనే సవరణలను అవినీతి నిరోధక చట్టంలో చేర్చిందని అన్నారు. అవినీతి వర్ధిల్లాలి అనే రీతిలో అన్ని పార్టీలూ పార్లమెంటులో ఈ చట్టసవరణకు మద్దతు పలికాయన్నారు.

చుట్టూ ఏం జరుగుతోందో గుర్తిస్తూ, యువత అవినీతిపై నిర్దిష్ట పద్ధతులతో ఒడుపుగా, సంఘటితంగా పోరాడాలని, నిరంతర చైతన్యంతో వ్యవహరించాలని జేపీ సూచించారు. ఈ సందర్భంగా మింట్ అధికార, ఉద్యోగ సిబ్బంది లేవనెత్తిన పలు ప్రశ్నలకు ఆయన జవాబిచ్చారు. వారోత్సవాలలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కూడా నిర్వహించే అవగాహన కార్యక్రమాల గురించి విజిలెన్స్ ఆఫీసర్ పి.నాగేశ్వరరావు తెలిపారు. అవినీతికి వ్యతిరేకంగా అధికారులు, ఇతర ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సంస్థ జనరల్ మేనేజర్ సందీప్ జైన్, జీఎం (ఐటి) రమాకాంత్ దీక్షితులు, టంకాశాల కార్మిక సంఘ నాయకుడు డి.సురేష్, బీఎంఎంఎస్ నాయకుడు దశవర్ధం, సీఐఎస్ఎఫ్ బృందం, తదితరులు పాల్గొన్నారు. ✧

# ప్రతి ఒక్కరి, ప్రతి ఇంటీ పుస్తకం




## తప్పక చదవండి, చదివించండి

**పేజీలు : 64**

**వెల : రూ. 20/-**







# యువతకు ప్రత్యేక ఉపాధి శిక్షణా కార్యక్రమాల్ని నిర్వహించాలి



శ్రీకాకుళం జిల్లాలో తిత్లీ తుఫాను బాధిత ప్రాంతాల్లో లోక్‌సత్తా పార్టీ నేతలు పర్యటించారు. కడిసింగి, సిగలపుట్టిగరట్టి, కిల్లోయి, బూరసాయిపేట, కొనకడపుట్టి, రాజపేట, భాసింగాం, చిన్నకొత్తూరు, బాతుపురం గ్రామాల్లో పరిస్థితి దయనీయంగా ఉందని పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. కోటబొమ్మాళి, టెక్కలి, సంతబొమ్మాళి, వజ్రపుకొత్తూరు, పలాస మండలాల్లో పునరుద్ధరణ కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరగాల్సి ఉందన్నారు. ఇక్కడి యువతకు ప్రత్యేక శిక్షణనిచ్చి ఉపాధి అవకాశాల్ని కల్పించాలన్నారు. బాధితులకు లోక్‌సత్తా తరపున తక్షణసాయంగా 5 టన్నుల కూరగాయల్ని సరఫరా చేసినట్లు తెలిపారు. తిత్లీని రాష్ట్ర ప్రభుత్వం ప్రచారానికి వాడుకోవటం తగదని, కేంద్రం ఫెడరల్ స్ఫూర్తికి అనుగుణంగా సాయం అందించాలని డిమాండ్ చేశారు.

Posting Date 22-11-2018
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on November 16th 2018







భారతదేశ పునర్నిర్మాణానికి
ఆచరణాత్మక సంస్కరణలపై రూర్కీ
ఐఐటీలో విద్యార్థులతో ఆలోచనల్ని
పంచుకుంటున్న ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా
వ్యవస్థాపకుడు డా॥ జేపీ

| Book-Post<br>PRINTED MATTER | To |
|---|---|
| If not delivered please return to:<br><br>Lok Satta Times<br>Tulips Apartment,<br>6-3-655, Flat.No. 407,<br>Behind Civil Supplies Office,<br>Somajiguda<br>Hyderabad- 500082 | |

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad